


విజయదశమి సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. బుధవారం సంచిక విలువడదు.. పునరదర్శనం గురువారం.

- ఎడిటర్

www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 349 | మంగళవారం | 20 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ' 5

## ఎల్‌నినో ఉపద్రవంపై ఉపసంఘం

**చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**

**సభ్యులుగా ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, తుమ్మల, వాకిటి**



ఎల్‌నినోను ఎదుర్కోవడానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ ఉపసంఘానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చైర్మన్‌గా ఉంటారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు.



## దసరా ధమాకా

**ఫుల్ జోష్‌లో 'మద్యం'**

**17వ తేదీన ఒక్కరోజే 223.25 కోట్ల అమ్మకాలు**

**గత ఏడాదితో పోల్చితే కొత్త రికార్డులు**

**ఎక్సైజ్‌శాఖకు కాసుల పంట**

02



# ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరమవ్వడం తథ్యం

- ఫ్యూచర్ సిటీలో ప్రగతి పనులపై సీఎం ఆదేశాలు
- ప్రపంచంలోనే ఇది గొప్ప నగరమవుతుంది
- రోడ్లు, భవనాలు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి
- వివిధ నిర్మాణ పనుల పరిశీలన
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ సందర్శన
- రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం నూతన భవనానికి సీఎం భూమిపూజ
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి
- నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి కావాలని సీఎం ఆదేశాలు



**ప్రపంచం ముందుకు ఫ్యూచర్ సిటీ లక్ష్యాలు**

**వేర్వేరు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** అంతర్జా తీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అధికారు లను ఆదేశించారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ఆయన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యే లా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు పదిహేను రోజుల ముందుగానే పనులు పూర్త య్యేలా చూడాలన్నారు. అవసర మైతే సిబ్బంది సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబర్ నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్

మిగతా 2 లో

## దీపావళికే 'నామినేటెడ్' వెలుగులు

**కార్పొరేషన్లు, కమిషన్ల పోస్టుల భర్తీ**

**కొత్తవారికి పెద్ద సంఖ్యలో అవకాశం**

**ఆరు కార్పొరేషన్ల చైర్మన్లకు రెన్యువల్!**

**రైతు కమిషన్ చైర్మన్‌కూ కొనసాగింపు**

**మిగిలిన వాటిపై తర్జన భర్జన**

**ఎస్టీ కమిషన్‌ను విడిగా ఏర్పాటు చేసే యోచన**

కాంగ్రెస్ నేతలకు ఈసారి దీపావళి పండుగ డబుల్ ధమాకా తీసుకురానుంది. పార్టీ నేతలు చాలా రోజులుగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్లు, కమిషన్ల చైర్మన్లు, సభ్యుల భర్తీకి ప్రభుత్వం దీపావళిని ముహూర్తంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. టీజీఐఐసీ, శాప్ వంటి కీలకమైన ఆరు కార్పొరేషన్లు మినహా.. మిగిలిన కార్పొరేషన్లకు చైర్మన్లు, సభ్యులుగా కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు.

02



## మున్సిపల్ జీతాలకు ముహూర్తమెప్పుడు

**మూడేండ్లుగా నయాపైసా పెంచని కాంగ్రెస్ ప్రభుత్వం**

**పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి**

**కేసీఆర్ హయాంలో రూ.8వేల నుంచి 16,600 చేశాం**

**ఇతర విభాగాలకూ గ్రూప్ విధానం అమలుచేయాలి**

**కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తా**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు స్పష్టం**

03

## ఆహారభద్రత భరోసాకు అత్యవసర ప్రణాళిక

**పరిశీలించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం**

**ఎల్‌నినో నేపథ్యంలో సమీక్ష.. ముందస్తు సన్నద్ధతపై చర్చ**



02

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు భరోసా కల్పిస్తూ 14నెలల అవసరాలకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

# ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరమవ్వడం తథ్యం

మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2028 ఏర్పాట్లపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. "మీ పెట్టుబడులకు మాది భరోసా." అనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సమ్మిట్ ఏర్పాట్లపై కసరత్తు చేయాలన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే స్థాయిలో సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. బహిరంగ ప్రాంగణ పనులను నవంబరు 15లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని సీఎం అన్నారు. సమ్మిట్ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు ఒక కమిటీని నియమించి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రపంచంలోనే గొప్పనగరంగా భారత్ ఫ్యూచర్సిటీ నిర్మాణం కొనసాగాలని సీఎం రేవంత్రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇకపై తరచూ ఈ సిటీ నిర్మాణ పనులపై స్వయంగా పర్యవేక్షిస్తానని, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నిర్దేశించారు. త్వరలో పాలన పూర్తిగా ఇక్కడి నుంచే జరిగేలా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి ని వేద మంత్రాల నడుమ కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆ తర్వాత యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సీఎం సందర్శించారు. మాస్టర్ ప్లాన్ను పరిశీలించి స్వల్ప మార్పులను సూచించారు. ఇప్పటివరకు జరిగిన పనుల తీరుతోపాటు నిర్మాణ పనులకు ఇంకా ఎంత సమయం పడుతుంది..? అన్న అంశాలపై ఆరా తీశారు. కీలక పాలనా భవనాలను త్వరలోనే పూర్తి చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిధుల కొరత లేకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రపంచంలోనే గొప్ప నగరాల్లో ఒకటిగా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యునాని మెడిసిన్ నూతన భవనానికి సీఎం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ నగర మాస్టర్ ప్లాన్పై కీలక వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలు, మాస్టర్ ప్లాన్పై ఉన్నతాధికారులతో చర్చించి మ్యాపులను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ మ్యాపులను పరిశీలించిన సీఎం రేవంత్రెడ్డి పలు మార్పులను సూచించారు. పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

### రూ.200కోట్ల అంచనాతో ఎన్ఐయూఎం భవనానికి శంకుస్థాపన...

పట్టణ సమస్యలకు పరిశోధనలతో పరిష్కారాలు చూపడం, పురపాలనలో నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా భారత్ ఫ్యూచర్ సిటీలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ (ఎన్ఐయూఎం) నూతన ప్రాంగణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 20 ఎకరాల భూమిని కేటాయించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్2 నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు దేం నరేందర్రెడ్డి, మల్లు రవి, దామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాడయ్య, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్నినో ఉపద్రవంపై ఉపసంఘం

### చైర్మన్గా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

### సభ్యులుగా ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, తుమ్మల, వాకిటి

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఎల్నినోను ఎదుర్కోవడానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ ఉపసంఘానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చైర్మన్గా ఉంటారు. మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎల్నినో పరిస్థితులు, కరువును అధిగమించడానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ప్రణాళిక శాఖ కార్యదర్శి కన్వీనర్గా వ్యవహరిస్తారు. ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉంటూ ఎల్నినో పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఉపసంఘంతో సమన్వయం చేస్తారని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్నినో పరిస్థితులను మంత్రివర్గ ఉపసంఘం నిరంతరం సమీక్షిస్తూ.. సంబంధిత శాఖలకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తుంది. ఎల్నినో, కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.

### ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ వేగం పెంచాలి: భట్టి

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి బడ్జెట్లో కేటాయించిన సబ్ప్లాన్ నిధుల పూర్తి స్థాయి వినియోగంలో వేగం పెంచాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయం వేగవంతం చేయడంతోపాటు వెనుకబడ్డ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారతకు కేటాయించిన నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. సబ్ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఉపయోగపడేలా శాఖల వారీగా వ్యయ ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు.

నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలన్నారు. ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణను రూపొందించాలని చెప్పారు. నిర్దేశిత లక్ష్యాలకనుగుణంగా కేటాయించిన నిధుల ఖర్చుపై సంబంధిత శాఖలు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలోపేతానికి అందుబాటులో గల వనరుల సమర్థవంతంగా వినియోగించుకోవడంతోపాటు అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ప్రపంచం ముందుకు ఫ్యూచర్ సిటీ లక్ష్యాలు

## వేర్వేరు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** పొలిటికల్ బ్యూరో: ఈ ఏడాది డిసెంబర్లో జరగనున్న 'గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్-2.0కు పకడ్బందీ వ్యూహరచన జరుగుతోంది. భారత్ ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులకు సంబంధించి ఇదివరకే కుదిరిన ఎంవోయూలన్నీ కార్యరూపంలోకి వచ్చేలా చూస్తున్నారు. 30వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మితం కానున్న ఈ నాలుగో నగరంలో తలపెట్టిన ఆరు విభాగాల అభివృద్ధికి వేర్వేరు కార్యాచరణ ప్రణాళికలను ప్రకటించనున్నారు. అందుకోసం సీఎం కార్యాలయ అధికారులు ముసాయిదాలు సిద్ధం చేస్తున్నారు. దేశాన్ని మెప్పించడం.. ప్రజలను ఒప్పించడం.. ఒక ఎత్తయితే, ప్రపంచాన్ని ఆకర్షించడమే ఏకైక లక్ష్యంగా సీఎం రేవంత్రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మూడు నెలలపాటు సుదీర్ఘ కసరత్తు అనంతరం రూపొందించిన 'ఫ్యూచర్ సిటీ' లక్ష్యాలను ప్రపంచం ముందు ఆవిష్కరించేందుకు సీఎం రేవంత్రెడ్డి సంసిద్ధమవుతున్నారు.

### ప్రపంచ ప్రమాణాలతో వరల్డ్ ట్రేడ్ సెంటర్

ప్రపంచ దేశాల వాణిజ్యం అంతా కేంద్రీకృతమయ్యేలా ఓ ట్రేడ్ సెంటర్ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇప్పటికే ఒప్పందం కుదిరిన వరల్డ్ ట్రేడ్ సెంటర్కు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఏఐ సిటీకి ప్రతిపాదించిన స్థలం సమీపంలో మూడు ప్రాంతాల్ని ఎంపిక చేశారు. ఎయిర్పోర్ట్, మెట్రోరైల్ స్టేషన్లకు వేగంగా చేరుకునేందుకు వీలుగా ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు వరల్డ్ ట్రేడ్ సెంటర్కు అనుసంధానమై ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మొత్తంగా 70 ఎకరాల స్థలంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ను నిర్మించే అవకాశం ఉంది.

### విస్తృతమైన ట్రాన్స్పోర్ట్ నెట్వర్క్..

రాజధాని శివార్లలో శ్రీశైలం హైవేపై ఏర్పాటయ్యే ఈ నెట్ రో కార్బన్ సిటీకి కొద్ది నిమిషాల్లో కొద్ది నిమిషాల్లో చేరుకోవాలంటే అవసరమైన రవాణా సదుపాయాలపై సీఎం రేవంత్ చాలాసార్లు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. హైదరాబాద్ నగరం వివిధ ప్రాంతాల నుంచి ముఖ్యంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్డు, మౌలిక సదుపాయాలు, మెట్రో రైలు కనెక్టివిటీ కల్పించడంపై సీఎం రేవంత్రెడ్డి ఇప్పటికే వివిధ శాఖలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఫ్యూచర్ సిటీకి 16 రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం ఇప్పటికే రూట్ మ్యాప్ ఇచ్చారు.

### మెట్రో విస్తరణకు ఐదు కొత్త కారిడార్లు..

మెట్రో రైలు ప్రతిపాదిత రెండో దశ 78 కిలోమీటర్లతో ఐదు కారిడార్లు రానున్నాయి. ఇందులో శంషాబాద్ ఎయిర్పోర్టు హైదరాబాద్ సిటీలోని మెట్రో లైన్లతో అనుసంధానం కానున్నాయి. అటు ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు మార్గాల ప్రతిపాదనలను అధికారులు కొద్దిరోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారు. మొదటి ప్రతిపాదనలో రూ.6173 కోట్ల వ్యయంతో ఎయిరిపోర్ట్ నుంచి స్కిల్ వర్సిటీ దాకా దూరం 32 కిలోమీటర్లలో 12 స్టేషన్లు ఉన్నాయి. రెండో ప్రతిపాదనలో రూ.5216 కోట్ల వ్యయంతో ఎయిర్ పోర్ట్ నుంచి స్కిల్ వర్సిటీ వయా రావిర్యాల మీదుగా (32 కి.మీటర్లు) 10 స్టేషన్లు వస్తాయి. మూడో ప్రతిపాదనలో రూ.3256 కోట్ల వ్యయంతో ఎయిర్ పోర్ట్ నుంచి వయా శ్రీశైలం రోడ్డు ద్వారా (32 కి.మీ) 12 స్టేషన్లు ఉన్నాయి. 2028 నుంచి 2053 వరకు ప్రయాణికుల సంఖ్య కూడా ఎంత ఉంటుందో అంచనాలు వేసి అంతా పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను డిసెంబర్లో జరగనున్న 'గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్-2.0'లో ప్రకటించనున్నారు.

### అనుభవాలు, అధ్యయనాల సమాహారం..

రేవంత్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' అభివృద్ధికి తోడ్పాటుగా తన విదేశీ పర్యటనలు, అధ్యయనాలు, అనుభవాలను నేపథ్యంలో తాజాగా అధికార యంత్రాంగానికి తగిన మార్గనిర్దేశం చేశారు. అధికారికంగా ప్రకటించకపోయినా.. దేశంలో రెండో రాజధాని స్థాయిలో అభివృద్ధి వైపు దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరం ఘనతను ప్రపంచస్థాయిలో చాటాలన్న లక్ష్యంతో రేవంత్ రెడ్డి సర్కారు ముందుకు సాగుతోంది. సాగుతోంది. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉన్న ప్రాంతం చుట్టూ ముచ్చెర్ల, బేగరికంచే తదితర గ్రామాలను కలుపుతూ తలపెట్టిన ఫ్యూచర్ అభివృద్ధి కార్యాచరణలో ప్రజా నగరాలు (లివింగ్ సిటీలు) కూడా ఏర్పాటు చేయాలన్న మరో కొత్త ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు దాదాపు పూర్తయింది. ఆ దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎఫ్సీడీఏ) అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

### అనుభవజ్ఞులతో సమాలోచనలు..

కనిపించేలా చేసేందుకు మౌలిక వసతుల కల్పనకు 'క్రెడాయ్' ప్రతి వివిధ రంగాల్లో ఇప్పటికే కుదిరిన ఒప్పందాలన్నీ క్షేత్రస్థాయిలో నిధులతో తాజాగా రేవంత్రెడ్డి సమాలోచనలు జరిపారు. స్థిరాస్తి వ్యాపార రంగంలో 3 దశాబ్దాల అనుభవం కలిగిన ఆ సంస ప్రతినిధుల ఆలోచన మేరకు ఫ్యూచర్ సిటీలో ప్రజలు నివసించేకాలనీలు (లివింగ్ సిటీలు) అవసరమన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మా సిటీ సిటీ కంపెనీలకు కంపెనీ మానవ వనరులను సమకూర్చడం, అందుకు వెసులుబాటు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. నివాస గృహ సముదాయాల నిర్మాణానికి భూములు కేటాయించి ఇప్పటి నుంచే లేఅవుట్లు సిద్ధం చేసే పనులు ప్రారంభించాలని, తద్వారా బహుళజాతి కంపెనీలను మరింతగా ఆకర్షించవచ్చునని సర్కారు భావిస్తోంది. వంద ఎకరాలకు ఒకటి చొప్పున లివింగ్ సిటీలను ఏర్పాటుకు దిశగా యోచిస్తోంది. క్రెడాయ్ ప్రతిపాదనకు సీఎం సూచనప్రాయ అంగీకారం తెలిపి అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు ఇచ్చారు. అధికారుల నివేదిక ప్రకారం.. ఫోర్త్ సిటీ దీ0పిక చేసిన ప్రాంతంలో 15 నుంచి 16 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం కార్యాచరణ మొదలు పెట్టింది.

# ఆహారభద్రత భరోసాకు అత్యవసర ప్రణాళిక

### పరిశీలించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

### ఎల్నినో నేపథ్యంలో సమీక్ష.. ముందస్తు సన్నద్ధతపై చర్చ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు భరోసా కల్పిస్తూ 14నెలల అవసరాలకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పేద కుటుంబాలపై ధరల భారాన్ని తగ్గించేందుకు రేషన్ షాపుల ద్వారా గోదుమపిండి, ఎంపిక చేసిన నిత్యావసరాలు (కందిపప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం) అందించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం ఎంత ఖర్చవుతుందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు సచివాలయంలో సోమవారం తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాబోయే సీజన్లలో వర్షపాతం తగ్గినా రేషన్ సరఫరాకు అంతరాయం కలగకుండా ధాన్యం సేకరణ, బియ్యం నిల్వల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర సంక్షేమ పథకాలకు కలిపి నెలకు 2.38 లక్షల టన్నుల బియ్యం అవసరం ఉందని, ఏడాదికి 28.56లక్షల టన్నులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబరు 16 నాటికి రాష్ట్రంలోని బఫర్ గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నాయని, పెండింగ్లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్), ఇతర గుర్తించిన సరఫరాల ద్వారా మరో 18.39లక్షల టన్నుల బియ్యం అందాల్సి ఉందని పేర్కొన్నారు. 2027 సెప్టెంబరు వరకు ఈ బియ్యం సరిపోతాయని వివరించారు. ఈ మేరకు ఉత్తమ్ స్పందిస్తూ.. మిల్లర్లు, ఇతర వనరుల నుంచి రావాల్సిన బియ్యం నిర్ణీత గడువులోగా గోదాములకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# తొంభైశాతం మంది అందరూ అర్హులే

### సర్ ప్రక్రియలో మొత్తం 92.88 లక్షల మందికి నోటీసులు

### విచారణలో 84,03,289 మంది అర్హులుగా నిర్ధారణ

### వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చడమే తరువాయి

### నోటీసులకు స్పందించనివారు 3 లక్షల మంది!

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో నోటీసులు అందుకున్న వారిలో 90శాతం మంది అర్హులేనని ప్రాథమికంగా తేలింది. 2002 ఎస్ఐఆర్లో లేకపోవడం, నోమ్యాపింగ్, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులకు సంబంధించి.. రాష్ట్రవ్యాప్తంగా 92.88 లక్షల మందికి నోటీసులు జారీచేశారు. వాటిలో 89.75లక్షల నోటీసులపై ఎన్నికల సంఘం విచారణ పూర్తిచేసింది. ఇప్పటి వరకు పూర్తిచేసిన నోటీసుల పరిశీలన ఆధారంగా.. నోటీసులు అందుకున్న 92.88 లక్షల మందిలో 84.03 లక్షల మంది తుది ఓటరు జాబితాలో ఉండడానికి అర్హులేనని తేలినట్లు సమాచారం.

వీరిని ఇక అధికారికంగా తుది ఓటరు జాబితాలో చేర్చడమే తరువాయి. ఈ మేరకు జిల్లాలవారీగా నోటీసులు, విచారణలు, ధ్రువీకరణల స్థితికి సంబంధించిన నివేదికను ఎన్నికల సంఘం సోమవారం నాటికి సిద్ధం చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. విచారణ పూర్తయినవాటిలో 31,063 కేసులను మాత్రమే తుది ప్రచురణకు అనర్హమైనవిగా అధికారులు గుర్తించారు. తుది ఓటరు జాబితాలో ఉండేందుకు అర్హులైన 84.03 లక్షల మందిలో.. 56,86,890 మంది లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీలో ఉన్నారు. ఓటరు సమర్పించిన వివరాలకు, పాత జాబితాలోని వివరాలకు తేడా ఉంటే దాన్ని లాజికల్ డిస్క్రిపెన్సీగా పరిగణిస్తారు. ఇక.. నో మ్యాపింగ్లో 27,16,465 మంది పేర్లు ఉన్నట్లు తెలిసింది. పాత (2002) జాబితాతో అనుసంధానం కానివాటిని నో మ్యాపింగ్ కేసులంటారు. నవంబరు 9న ప్రకటించే తుది ఓటరు జాబితాలో వీరందరి పేర్లు ఉండనున్నాయని సమాచారం. 22,457 మంది ఓటర్లకు నోటీసులు జారీచేసినా.. అవి ఇంకా వారికి చేరలేదు.

# దసరా ధమాకా

### దసరా నేపథ్యంలో ఫుల్ జోష్

### 17వ తేదీన ఒక్కరోజే 223.25 కోట్ల అమ్మకాలు

### గత ఏడాదితో పోల్చితే కొత్త రికార్డులు

### ఎక్సైజ్శాఖకు కాసుల పంట

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** దసరా పండుగ నేపథ్యంలో రాష్ట్రంలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. గతేడాది దసరా సీజన్తో పోలిస్తే.. ఈసారి మద్యం అమ్మకాల ఊపు పెరిగింది. దీంతో ఎక్సైజ్ శాఖ ఖజానా కాసులతో గలగలలాడుతోంది. బోనాల ఉత్సవాల నుంచి మొదలయ్యే మద్యం అమ్మకాల జోష్.. దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూఇయిర్ నుంచి సంక్రాంతి వరకు కొనసాగుతుంటుంది. ప్రస్తుతం దసరాకు మూడు నాలుగు రోజుల ముందు నుంచే మద్యం డిపోలు, వైన్ షాపులు, బార్ల వద్ద సందడి మొదలైంది. అక్టోబర్ 17న ఒక్క రోజే రూ.223.25 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే తేదీన నమోదైన రూ.89.28 కోట్లతో పోలిస్తే.. ఇది రెండున్నర రెట్లు అధికం. ఈ నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ నాటికి జరిగిన అమ్మకాల విలువ రూ.1751 కోట్లు. గత ఏడాది ఇదే వ్యవధిలో నమోదైన అమ్మకాలు రూ.1311 కోట్లు. అంటే, 33.5 శాతం పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో 2620 మద్యం దుకాణాలు, 1133 బార్లు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతి దసరా సీజన్లో మద్యం అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది దసరా పండుగ అక్టోబరు 2వ తేదీన రాగా.. దానికి ముందు మూడు రోజుల్లోనే డిపోల నుంచి దుకాణాలకు రూ.697.23 కోట్ల విలువైన మద్యం సరఫరా జరిగింది. ఈ ఏడాది కూడా దసరాకు ముందు మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ నెల 14న రూ.102.17 కోట్ల విలువైన విక్రయాలు జరగ్గా.. 16న రూ.126.32 కోట్లు, 17న రూ.223.25 కోట్లు, 19వ తేదీ సాయంత్రం నాటికి ఏకంగారూ.350 కోట్లకుపైగా విక్రయాలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ప్రతి నెలా సాధారణంగా రూ.150 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. దేశంలో అత్యధికంగా మద్యం విక్రయాలు జరిగే రాష్ట్రాల్లో కర్ణాటక, తమిళనాడు తర్వాత తెలంగాణ మూడో స్థానంలో ఉన్నప్పటికీ.. మొత్తం రాష్ట్ర పన్నురాబడిలో మద్యం వాటా శాతంలో మాత్రం తెలంగాణే మొదటి స్థానంలో కొనసాగుతోంది. 2024-25లో మద్యం విక్రయాలతో ప్రభుత్వానికి లభించిన ఆదాయం రూ.37,488 కోట్లు కాగా.. 2025-26 అది రూ.40,209 కోట్లుకు పెరిగింది.



# కన్నెపల్లిపై పోరాటం కన్వమ్

## రైతులకు మేలు చేయకపోతే పోరాటాలు తప్పవ్ : కవిత

మహదేవపూర్, అక్టోబరు 19 : రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొని రైతులకు మేలు చేయాలంటే.. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యామ్ నిర్మించి ప్రాణహిత నీళ్లను మళ్లించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి సూచించారు. నవంబరులోగా కాఫర్ డ్యామ్ నిర్మించాలన్నారు. రైతుల తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని, వినకపోతే ప్రభుత్వం మెడలు ఎలా వంచాలో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్(లక్ష్మీ పంప్‌హౌస్)ను సోమవారం ఆమె సందర్శించారు. గోదావరి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరంపవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాఫర్ డ్యామ్ నిర్మాణం ఎక్కడ చేపట్టవచ్చో... దాని ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉంటుందో వివరించారు. కేవలం రూ. 25 కోట్లు ఖర్చు చేస్తే నెలన్నర రోజుల్లో నిర్మాణం పూర్తి చేయొచ్చన్నారు. మేడిగడ్డ బూచిని చూపి రైతులకు నష్టం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కరువు కోరల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు నిపుణులతో మాట్లాడి కాఫర్ డ్యామ్ నిర్మాణమే సరైన పరిష్కార మార్గమని గుర్తించామన్నారు. సంబంధిత సాంకేతిక అంశాలను ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. తమ సూచనను ప్రభుత్వం పరిశీలించాలని, ఏవైనా మార్పులు ఉన్నా తాము అంగీకరిస్తామని అన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు: సీతక్క

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి... గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా కృషి చేస్తానని మంత్రి సీతక్క తెలిపారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తగిన చర్యలపై సిఫారసు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీలో తనను సభ్యురాలిగా నియమించిన నేపథ్యంలో... పల్లెల్లో జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని సోమవారం మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవికి ముందే నీటి సమస్యలు గుర్తించడం, అందుబాటులో ఉన్న నీటివనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు... ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా అన్నిశాఖల సమన్వయంతో పనిచేస్తామని సీతక్క వెల్లడించారు. కాగా, ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, విద్యుత్తు కొరత రాకుండా జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించుకోవాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్తు కోతలను అమలు చేయడం లేదని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ఆయన సూచించారు.

# 34 నెలల్లో 12.4లక్షల పాసు పుస్తకాలు ఇచ్చాం

## భూభారతితో ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం: పొంగులేటి

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 5,68,858, ఈ చట్టానికి ముందు 6,71,508 పాసు పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాసు పుస్తకాలను రైతులకు అందించామని చెప్పారు. ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామని అన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీ-సర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో రీ-సర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450ఎకరాలకు పట్టాలు ఇచ్చామన్నారు. ములుగు జిల్లా ముల్కాపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వరావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాసు పుస్తకాలు అందిస్తామన్నారు.

# తగ్గిన విద్యుత్ డిమాండ్

## 17,756 మెగావాట్లకు తగ్గిన వైనం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గింది. ఈ నెల 15న గరిష్ఠ డిమాండ్ 20,003 మెగావాట్లుగా నమోదు కాగా... మరుసటి రోజు 20,018 మెగావాట్లకు పెరిగింది. ఆ తర్వాత నుంచీ విద్యుత్ డిమాండ్ క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ నెల 17న 19,382 మెగావాట్లు, 18న 18,092 మెగావాట్ల డిమాండ్ ఉండగా, సోమవారం ఉదయం 9:57 గంటల సమయంలో 17,756 మెగావాట్లకు తగ్గిపోయింది. దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది సొంతూళ్లకు వెళ్లడంతో ఏసీల వినియోగం బాగా తగ్గిందని, దీనికితోడు వాతావరణం కాస్త చల్లబడడంతో విద్యుత్ డిమాండ్ తగ్గిందని అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ వినియోగం కూడా కాస్త తగ్గిందని చెబుతున్నారు. ఈనెల 18న రాష్ట్రంలో 319 మిలియన్ యూనిట్లను వినియోగించగా, బహిరంగ విపణిలో 96మిలియన్ యూనిట్లను సగటున రూ. 4.94కు కొనుగోలు చేశారు. జెన్‌కో థర్మల్ కేంద్రాల్లో 7,180మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్లను నడిపించి...100 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసి, గ్రిడ్‌కు అందించారు. ఈ ప్లాంట్ల ఉత్పాదక సామర్థ్యం 63.37శాతంగా నమోదైంది. డిమాండ్ తగ్గడంతో విద్యుత్ పంపిణీ సంస్థలు ఊపిరి పీల్చుకున్నాయి.

# మున్సిపల్ జీతాలకు ముహూర్తమెప్పుడు

- మూడేండ్లుగా నయాపైసా పెంచని కాంగ్రెస్ ప్రభుత్వం
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- కేసీఆర్ హయాంలో రూ.8వేల నుంచి 16,600 చేశాం
- ఇతర విభాగాలకూ గ్రూప్ విధానం అమలుచేయాలి
- కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తా
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు స్పష్టం
- సిద్దిపేట కార్మికులతో కలిసి అల్పాహారం, ఆత్మీయ పలుకరింపు
- దసరా పండుగ సందర్భంగా చీరలు, డ్రెస్‌లు అందజేసి శుభాకాంక్షలు



**ప్రజా దీవెన, సిద్దిపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లయినా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా వారి జీతాలు మాత్రం పెరుగక ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే కార్మికుల జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇతర మున్సిపల్ విభాగాల కార్మికులకూ గ్రూపు విధానాన్ని వర్తింపజేయాలని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తానని స్పష్టంచేశారు. దసరా పండుగను పురసరించుకొని సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో హరీశ్‌రావు ఆత్మీయంగా ముచ్చటించారు. వారితో కలిసి టిఫిన్ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన సొంత ఖర్చులతో మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు చేస్తున్న సేవకు తన వంతుగా గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్ట వివరించారు. పట్టణం పరిశుభ్రంగా కనిపించడం వెనుక వారి కష్టం, త్యాగం, నిరంతర శ్రమ దాగి ఉన్నాయని చెప్పారు.

### కాంగ్రెస్ హయాంలో ఎప్పుడూ కష్టాలే

కాంగ్రెస్ పాలనలో కార్మికులకు ఎప్పుడూ కష్టాలేనని హరీశ్‌రావు విమర్శించారు. నాటి రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో పారిశుద్ధ్య కార్మికులకు మూడు, ఐదు, ఆరు నెలలపాటు జీతాలు అందని పరిస్థితులు ఉండేవని దుయ్యబట్టారు. వేతనాల కోసం కార్మికులు ఎర్రజెండాలు పట్టుకొని ఆర్డీవో కార్యాలయాలు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయాల్సి వచ్చేదని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనం రూ. 8,300 మాత్రమే ఉండేదని, కాంట్రాక్టర్ల ప్రమేయంతో జీతాలు సకాలంలో అందడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యేవని పేర్కొన్నారు.

### అసెంబ్లీలో కార్మికుల గొంతుకగా నిలుస్తాం

పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపు, ఇతర మున్సిపల్ విభాగాలకు గ్రూపు విధానం విస్తరణ, ఉద్యోగుల కుటుంబాలకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిషారం వంటి అంశాలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా నెరవేర్చాలని హితవు పలికారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికుల జీవితాల్లోనూ వెలుగులు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టంచేశారు.

### కేసీఆర్ పాలనలో దశలవారీగా పెంపు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల వేతనాలను దశలవారీగా పెంచిందని హరీశ్‌రావు తెలిపారు. రూ. 8,300 నుంచి రూ. 16,600 వరకు పెంచడమే గాక కాంట్రాక్టర్లు, మధ్యవర్తుల ప్రమేయాన్ని తొలగించి ఏడుగురు కార్మికులతో ఒక గ్రూప్ ఏర్పాటుచేసి, ప్రభుత్వమే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమచేసే విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫలితంగా వేతనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి తగ్గిందని పేరొన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల వేతనాలను పెంచలేదని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు పెంచాలని కోరడంలో తప్పేమీ లేదని, వారి డిమాండ్ న్యాయమై నదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఇండ్లకే పరిమితమైనప్పటికీ వారు మాత్రం ప్రాణాలు పణంగా పెట్టి వీధులను శుభ్రం చేశారని హరీశ్‌రావు కొనియాడారు. ఆ సమయంలో తాను మంత్రిగా ఉండి కార్మికుల వెంట తిరిగి భరోసా కల్పించానని, అవసరమైన కిట్లు ఇచ్చినట్టు వివరించారు. సంక్షోభ సమయాల్లో ముందుండి సేవలందించే కార్మికులకు తగిన వేతనం, గౌరవం, ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించే విధానాన్ని ఇతర విభాగాలకూ విస్తరించాలని కోరారు.

# దీపావళికే 'నామినేటెడ్' వెలుగులు

- కార్పొరేషన్లు, కమిషన్ల పోస్టుల భర్తీ
- కొత్తవారికి పెద్ద సంఖ్యలో అవకాశం
- ఆరు కార్పొరేషన్ల చైర్మన్లకు రెన్యువల్!
- రైతు కమిషన్ చైర్మన్‌కూ కొనసాగింపు
- మిగిలిన వాటిపై తర్జన భర్జన
- ఎస్టీ కమిషన్‌ను విడిగా ఏర్పాటు చేసే యోచన

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కాంగ్రెస్ నేతలకు ఈసారి దీపావళి పండుగ డబుల్ ధమాకా తీసుకురానుంది. పార్టీ నేతలు చాలా రోజులుగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్లు, కమిషన్ల చైర్మన్లు, సభ్యుల భర్తీకి ప్రభుత్వం దీపావళిని ముహూర్తంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. టీజీఐఐసీ, శాప్ వంటి కీలకమైన ఆరు కార్పొరేషన్లు మినహా.. మిగిలిన కార్పొరేషన్లకు చైర్మన్లు, సభ్యులుగా కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆయా కార్పొరేషన్లకు ఇటీవలి వరకూ చైర్మన్లు, సభ్యులుగా ఉన్నవారిని పార్టీ సేవలకు వినియోగించుకునే యోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపాదనపై తర్జన భర్జన నడుస్తోంది. ఆరు కార్పొరేషన్లకు మాత్రం ఇటీవలి వరకు చైర్మన్లుగా ఉన్నవారినే తిరిగి నియమించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక విద్యా కమిషన్, రైతు కమిషన్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమిషన్ల చైర్మన్ల పదవీకాలం కూడా పూర్తయిన నేపథ్యంలో దీపావళి కల్లా వీటికీ చైర్మన్లు, సభ్యులను నియమించనున్నట్లు సమాచారం. రైతు కమిషన్‌కు కోదండరెడ్డినే కొనసాగించే అవకాశం ఉన్నట్లు, విద్యా కమిషన్ చైర్మన్ పదవికి మాత్రం టీజేఎస్ నేత విశ్వేశ్వర్‌రావు పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రైతు, విద్యా కమిషన్ల సభ్యుల సంఖ్యను పెంచే అవకాశం ఉందంటున్నారు. కాగా, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విడదీసి.. ఎస్టీ కమిషన్‌ను వేరుగా ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాతే ఈ రెండు కమిషన్లకు చైర్మన్లు, సభ్యులను నియమించనున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు జిల్లాల స్థాయిలో పీఏసీఎస్ అధ్యక్షులు, వివిధ దేవాలయాల కమిటీలు, ఇతర నామినేటెడ్ పోస్టుల నియామకాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి. నవంబరులో డీసీసీబీల చైర్మన్ పదవుల భర్తీ ప్రక్రియను కూడా చేపట్టాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా దీపావళి కల్లా నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తి చేయాలన్న ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఉన్నట్లు సమాచారం.

## ఆర్టీసీ చైర్మన్‌గా బొంతు రామ్మోహన్!

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) చైర్మన్‌గా బొంతు రామ్మోహన్‌ను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్టీసీ చైర్మన్ పదవీ ఖాళీగానే ఉంది. త్వరలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున సంస్థ చైర్మన్ నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఒకటి, రెండు పేర్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నప్పటికీ బొంతు రామ్మోహన్‌వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు దసరా పండుగ తర్వాత వెలువడే అవకాశం ఉంది. కాగా, ప్రస్తుతం ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అయితే, సంస్థకు, ప్రభుత్వానికి మధ్య కీలకంగా ఉండే చైర్మన్ పదవి ఖాళీగా ఉండడం, గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతిచ్చిన కార్మిక సంఘం ఆశించిన ఫలితాలు సాధించకపోవడం వంటి పరిణామాల దృష్ట్యా చైర్మన్ నియామకం తర్వాతే ఉద్యోగుల విలీనం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

# ఎల్‌నినోతో ప్రపంచానికే ముప్పు

- విపత్తును సర్కార్‌పై మోపడం సిగ్గుచేటు
- దేశంలో కొనడానికి కరెంట్ దొరకడం లేదు
- రైతులు ఆరుతడి పంటలు వేయాలి: తుమ్మల

**ప్రజా దీవెన, జూలూరుపాడు :** "ఎల్‌నినో రూపంలో ప్రపంచానికే ఒక విపత్తు వచ్చింది. అది తెలంగాణకో, ఆంధ్రాకో, భారతదేశానికో రాలేదు. అవగాహన లేకుండా ప్రతిపక్షాలు ఎల్‌నినో విపత్తును ఓ నెపంగా చూపుతూ దాన్ని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపడం సిగ్గుచేటు" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు, అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో పర్యటించి సీతారామ టన్నెల్, దుమ్ముగూడెం ఆనకట్ట ప్రాంతాలను పరిశీలించారు. వెలుగుమట్ల మోడల్ హౌసింగ్ కాలనీ పనులు పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది విజయదశమి నాటికి సీతారామ టన్నెల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో కొనడానికి కరెంట్ కూడా దొరకడం లేదని, భూమిలో నీళ్లు కూడా లేవని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రపంచాన్నే గడగడలాడిస్తుంటే.. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు ఇది కాంగ్రెస్ కరువని మాట్లాడం మంచిదికాదని మండిపడ్డారు. కాగా, ఖమ్మం సమీపంలో వెలుగుమట్లలో పేదల కోసం నిర్మిస్తున్న మోడల్‌కాలనీని డిసెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నవంబరు 15నాటికి ఇళ్ల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలు పూర్తి కావాలన్నారు.

# అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారత్లోనే..

## జాబితాలో బులంద్ షహర్, త్రిపుర, ముంబై, ఢిల్లీ, కోటా

## మొదటి స్థానంలో ఇండోనేషియా నగరం

**న్యూఢిల్లీ:** ప్రపంచంలో అత్యధిక వాయు కాలుష్యం నమోదవు తున్న టాప్ -20 నగరాల్లో 13 భారతదేశానికి చెందినవి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే, దేశ రాజధాని ఢిల్లీ మాత్రం ప్రపంచ టాప్- 20 జాబితాలో లేక పోవడం విశేషం. అక్టోబర్ 19న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎక్యుఐ డాట్ ఇన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఈ వివరాలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్ లోని బులంద్ షహర్ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కాలుష్య నగరాల జాబితాలో 3వ స్థానంలో నిలిచింది. అక్కడ అమెరికా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యుఐ) 198గా నమోదైంది. ఇది ఆరోగ్యానికి హానికరమైన స్థాయి. త్రిపుర రాజధాని అగర్తల 181 ఎక్యుఐతో నాలుగో స్థానాన్ని దక్కించు కుంది. రాజస్థాన్లోని పాలీ, ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్నగర్, మధ్యప్రదేశ్ లోని బుర్హాన్పూర్ నగరాల్లో ఎక్యుఐ స్థాయి 174గా నమోదైంది. హర్యానాలోని రోహ తక్లో 172, రాజస్థాన్లోని కోటాలో 170, ముంబైలో 167, హాపూర్లో 166, హిసార్, బికనీర్లలో 165, బరేలీలో 164 చొప్పున వాయునాణ్యత సూచీనమోదైంది. దీంతో ఈ నగరాలు ప్రపంచంలోని అత్యంత కాలుష్య ప్రాంతాల జాబితాలో చోటు సంపాదించాయి. ఇక ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరంగా ఇండోనేషియా లోని పలాంగ్కరా య మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ ఎక్యుఐ 242గా నమోదైంది. ఇది తీవ్రమైన కాలుష్య స్థాయి. ఇండోనేషియాలోని పాలెంబాంగ్ 207తో రెండో స్థానంలో నిలిచింది. సాంపిట్ (180) ఐదో స్థానంలో, జాంబీ (176) ఆరో స్థానంలో ఉన్నాయి. మలేషియాలోని పుత్రజయ, కౌలాలంపూర్, పెటాలింగ్ జయ నగరాలు కూడా టాప్-20లో నిలిచాయి. టాప్-20 కాలుష్య నగరాల జాబితాలో ఢిల్లీ లేకపోయినప్పటికీ, హస్తినలో వాయు కాలుష్యం ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతోంది. అక్టోబర్ 19 ఉద యం 7.31 గంటలకు ఢిల్లీలో ఏక్యూ గరిష్ఠంగా 191ం స చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు అక్టోబర్ 18 సాయంత్రం 5.01 గంటలకు కనిష్ఠంగా 126గా నమోదైంది. అనంతరం కాలుష్య స్థాయి తగ్గుతూ అక్టోబర్ 19 మధ్యాహ్నానికి 130ల స్థాయికి చేసింది.

# ఉత్తర కోస్తాకు తీవ్ర తుఫాన్ ముప్పు!

### 24న అండమాన్ సముద్రంలో అల్పపీడనం?

### 26, 27 తేదీల్లో వాయుగుండంగా బంగాళాఖాతంలోకి ప్రవేశం

### 29, 30 తేదీల్లో తీవ్ర తుఫాన్గా ఉత్తర కోస్తా తీరంపైకి..

### ఐరోపా వాతావరణ సంస్థ అంచనా

**అమరావతి :** ఉత్తర కోస్తాకు తీవ్ర తుఫాన్ గండం పొంచి ఉంది. ఈనెల 29 లేదా 30వ తేదీన ఉత్తరకోస్తాలో తీవ్ర తుఫాన్ తీరం దాటనుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం ఈనెల 22 నాటికి అండమాన్ సముద్రంలోకి ప్రవేశించనుంది. దాని ప్రభావంతో 24 లేదా 25న అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి 26వ తేదీ తర్వాత మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో వాయుగుండంగా మారనుంది. ఆ తర్వాత ఉత్తర కోస్తా దిశగా పయనిస్తూ 28వ తేదీ నాటికి తుఫాన్గా మారుతుందని ఐరోపా వాతావరణ సంస్థ అంచనా వేసింది. తర్వాత మరింత బలపడి 29 లేదా 30వ తేదీన ఉత్తరకోస్తాలో తీరం దాటనుందని తాజా బులెటిన్లో పేర్కొంది. కాగా, దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తా పరిసరాల్లో తీరం దాటుతుందని మరో వాతావరణ మోడల్ అంచనా వేసింది. ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాల్లో భారీవర్షాలు కురుస్తాయని, బలమైన గాలులు వీస్తాయని అంచనా వేసింది. మరోవైపు అదే సమయంలో అరేబియా సముద్రంలో వాయుగుండం ఏర్పడి, మహారాష్ట్రలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ విశ్రాంత అధికారి ఒకరు తెలిపారు. నెలాఖరు వరకు ఏర్పడే తుఫాన్లు ఉత్తరకోస్తా, ఒడిశా పరిసరాల్లో తీరం దాటుతుంటాయని వివరించారు. నేడు, రేపు భారీ వర్షాలు: ఉత్తర తమిళనాడు పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. దీని నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం అల్లూరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం అల్లూరి, పోలవరం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడతాయని వివరించింది.

# నామినేషన్ల గడువు పొడిగించండి

## ఏకగ్రీవాలు ప్రకటించకుండా స్టే విధించండి

## మున్సి పోల్స్‌పై సుప్రీంకోర్టుకు వైసీపీ

**న్యూఢిల్లీ :** పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికల్లో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, దీనిపై తక్షణమే జోక్యం చేసుకోవాలంటూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్లకు ఆటంకాలు సృష్టించారని తెలిపింది. తమ నేతలకు రక్షణ కల్పించడంతోపాటు నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలని, అదనపు కేంద్రాలను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో నామినేషన్ల గడువును పెంచేందుకు నిరాకరిస్తూ, ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వైసీపీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. గడువు ఇప్పటికే ముగిసిందని, ఈ దశలో జోక్యం చేసుకుంటే ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలుగుతుందంటూ హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో వైసీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేరుతో పిటిషన్ దాఖలైంది. పుంగనూరు, రాయచోటి, కడప, తిరుపతి ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా పలు సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. కడపలో ఒక అభ్యర్థికి చెందిన నామినేషన్ పత్రాలను చింపివేశారని, తిరుపతి కార్పొరేషన్ పరిధిలో పోటీ చేయాల్సిన తొమ్మిది మంది వైసీపీ అభ్యర్థులను ఆయా ఆర్వో ఆఫీసుల్లోకి వెళ్లకుండా నిలిపివేశారని ఆరోపించారు. అభ్యర్థులతో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఎంపీ మిథున్ రెడ్డి వాహన శ్రేణిపై కూడా దాడికి పాల్పడ్డారని పిటిషన్‌లో ఆరోపించారు. పరిస్థితుల దృష్ట్యా జిల్లా కేంద్రాల్లో అదనపు నామినేషన్ సదుపాయాలు కల్పించాలని కోరుతూ అంతకుముందు వైసీపీ హైకోర్టును ఆశ్రయించగా.. ఈ నెల 15న సింగిల్ బెంచ్ ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది. వ్యక్తిగతంగా సంబంధిత అధికారులను ఆశ్రయించే వెసులుబాటు కల్పించింది. తదనంతరం జరిగిన పరిణామాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా.. కేంద్రాల వద్ద భద్రత పెంచాలని స్పష్టం చేసిన ఎస్ఈసీ, గడువు పెంపునకు మాత్రం నిరాకరించిందని పిటిషన్‌లో ప్రస్తావించారు. పోటీ చేసే అవకాశాన్ని నిరోధించినప్పుడు ప్రజాస్వామ్య ప్రక్రియ పరిరక్షణకు కోర్టులు జోక్యం చేసుకోవచ్చని పిటిషన్‌లో వెల్లడించింది. ఆటంకాల వల్ల నామినేషన్లు వేయలేకపోయిన వారికి పొడిగించిన సమయంలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ప్రక్రియపై ఉన్న న్యాయపరమైన నియంత్రణ కేవలం స్వచ్ఛంద సంయమనం కోసమేనని, అభ్యర్థులు పోటీ చేయకుండా నిరోధించినప్పుడు రాజ్యాంగబద్ధ కోర్టులు తగిన సూచనలు ఇవ్వవచ్చని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తుది ఆదేశాలు వచ్చే వరకు ప్రభావిత వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు ప్రకటించకుండా స్టే విధించాలని వైసీపీ కోరింది. ఈ పిటిషన్‌ను న్యాయవాది (ఏఓఆర్) మహఫూజ్ ఎ. నాజ్కి ద్వారా వైసీపీ సమర్పించింది.

# ట్రిగ్గర్ ఫెయిలవడం వల్లే టైగర్ సేఫ్

### అందువల్లే ప్రాణాపాయం తప్పింది

### దాడిలో ఏడు రౌండ్లు కాల్పులు

### రెండు లైవ్ కాట్రిడ్జ్లు స్వాధీనం

### బాలీవుడ్ నటుడిపై దాడి కేసులో కీలక విషయాలు

### రాజస్థాన్లో ముగ్గురు అరెస్టు

### కేసు నమోదు.. దర్యాప్తు ముమ్మరం

### నిందితుల్ని విడిచిపెట్టం: సీఎం ఫడ్నవీస్



**ముంబై:** బాలీవుడ్ నటుడు టైగర్ షాఫ్పై జరిగిన కాల్పుల ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దుండగు లు జరిపిన కాల్పుల్లో తుపాకీ మొరాయించడం కూడా ఒక కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమాని స్తున్నారు. ఘటనాస్థలంలో ఏడు రౌండ్లకు సంబంధించిన ఆధారాలు లభించగా, ఐదు ఖాళీ తూటాల షెల్స్ తో పాటు రెండు పూర్తి కాట్రిడ్జలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఇవి 7.62 మి.మీ. క్యాలిబర్కు చెందినవిగా గుర్తించారు. కాల్పులకు ఉపయోగించిన ఆయుధాల్లో టర్కీలో తయారైన జిగానా పిస్టల్ ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ దృశ్యాల ప్రకారం, ఒక దుండగుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న బీఎండబ్ల్యూ కారుపై పలుమార్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరో దుండగుడు కారు ప్యాసింజర్ వైపు కిటికీ సమీపంలో ఉండి తుపాకీని ఉపయోగించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

#### ముగ్గురు నిందితుల పట్టివేత

ఈ కాల్పుల ఘటనకు సంబంధించి రాజస్థాన్లోని కోటాలో ఇద్దరిని అరెస్టు చేసి, ఒక మైనర్ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో హర్యానాకు చెందిన 17 ఏళ్ల బాలుడు, రేహాన్, బిహా రకు చెందిన హృతిక్ కుమార్ ఉన్నట్లు సమాచారం. ముంబై పోలీసుల సమాచారంతో రాజస్థాన్ యాంటీ గ్యాంగ్ స్టర్ టాస్క్‌ఫోర్స్, కోటా సిటీ పోలీసులు సంయుక్తంగా రైల్వే కాలనీ ప్రాంతంలో వారిని పట్టుకున్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన ముంబై పోలీసులు, కేసును జుహూ పోలీస్ స్టేషన్ నుంచి ముంబై క్రైమ్ బ్రాంచ్కు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 109(1), 3(5)తో పాటు ఆయుధాల చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేశారు.

#### అనిల్ పండిట్ పనేనా?

టైగర్ ష్రఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనతో అమెరికాలో ఉంటున్నట్లు భావిస్తున్న అనిల్ పండిట్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్తో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడు, గతంలో ర్యాపర్ బాషాకు బెదిరింపులు, గాయకుడు గురురంధావాకు సంబంధించిన జిమ్ వద్ద కాల్పుల ఘటనలోనూ దర్యాప్తు వర్గాల దృష్టికి వచ్చాడు. హర్యానాలోని పానిపట్ జిల్లా రాయ్ కలాన్ గ్రామానికి చెందిన అనిల్ పండిట్ వయసు సుమారు 32 ఏళ్లు. 2023లో భారత్ను విడిచి వెళ్లిన అతడు తొలుత కెనడాకు, ఆ తర్వాత అమెరికాకు వెళ్లినట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ వార్తా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అమెరికా నుంచి భారత్లోని నేర కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు. హర్యానాలో వ్యాపారవేత్తలను బెదిరించి డబ్బు వసూలు చేయడం, కాల్పుల ఘటనలకు సంబంధించి అతడిపై పలు కేసుల్లో ఆరోపణలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

#### కఠిన చర్యలు తీసుకుంటాం: ప్రభుత్వం

టైగర్ ష్రాఫ్ పై కాల్పుల ఘటనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడినవారిని పిరికిపందలుగా అభివర్ణిస్తూ, వారి ప్రయత్నాలను అడ్డుకుం టామని హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే ఘటన అనంతరం టైగర్ షాఫ్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కాల్పుల కారణంగా నటుడి కుడిచేతికి గన్పౌడర్ వల్ల కాలిన గాయాలు అయినట్లు వెల్లడించారు. ముంబైలో గ్యాంగ్వార్లను తిరిగి ప్రోత్సహించేందుకు ఎవరినీ అనుమతించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

#### కేంద్రంపై కేజ్రీవాల్ ఫైర్

టైగర్ షాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనను ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. దేశంలో నేరాలు, భద్రత విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించారు. నేర కార్యకలాపాలు నిర్వహించడానికి కేంద్రం ఒక గ్యాంగ్టర్కు సౌకర్యాలు కల్పించిందని ఆరోపించారు. బీజేపీ (ఎన్డీఏ) సొంతంగా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ శాంతిభద్రతలను కాపాడుకోలేక "పోతోందని మండిపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్యాంగ్స్టర్ను (లారెన్స్ బిష్ణోయ్) అల్లుడిలా చూసుకుంటూ, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నేరాలకు పాల్పడటానికి అతడికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్లో పోస్ట్ పెట్టారు.

#### దుండుగులను వదిలి పెట్టం: సీఎం ఫడ్నవీస్

టైగర్ షాఫ్పై కాల్పుల ఘటనకు బాధ్యులైన వారిని, వారి వెనుక "వున్న వారిని వదిలిపెట్టబోమని, త్వరలోనే ముంబయి పోలీసులు పట్టుకుంటారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ఇటువంటి చర్యలను ఏమాత్రం సహించేది. లేదని స్పష్టం చేశారు. నిందితుల గుర్తింపునకు సంబంధించి పోలీసులకు కీలక ఆధారాలు లభించాయని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తారని చెప్పారు. నిందితులను పట్టుకునేందుకు ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకోవడంతో పాటు కేంద్ర దర్యాప్తు సాయం కూడా తీసుకుంటామని అన్నారు.

#### శాంతి భద్రతలు గాలికి: సంజయ్ రౌత్

శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో సీఎం దేవే పడణవీస్ విఫలమయ్యారని ఆరోపించారు. ఈ ముఠాలను దేవేంద్ర నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డా రు. రాష్ట్రంలో శాంతిభద్రతల సవాళ్లను పరిష్కరించడం మానేశ్, రాజకీయ ప్రత్యర్థులపై పడణవీస్ దృష్టి సారిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# మణిపూర్‌లో మళ్ళీ మంటలు

## నలుగురి మృతి.. సీఎం నివాసం వద్ద మృతదేహాలతో ఆందోళన

## ఇంఫాల్ తూర్పు జిల్లాలో కట్టెల కోసం వెళ్లిన ముగ్గురు గ్రామస్తులపై కాల్పు లు

**గువాహటి:** మణిపూర్లో మరోసారి హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఉదయం అనుమానిత మిలిటెంట్లు జరిపిన దాడిలో మెయితీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన కు నిరసనగా స్థానికులు మృతదేహాలను ఇంఫాల్లోని బాబుపారా ప్రాంతంలో ఉన్న ముఖ్యమంత్రి అధికారిక నివాసం ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకొని ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన -సమయంలో ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్చంద్ సింగ్ తన నివాసంలో ఉన్నారా లేదా అన్నది వెంటనే తెలియరాలేదు. మెయితీ ఆధిక్యం ఉన్న ఇంఫాల్ ఈస్ట్ జిల్లా, కుకీ ఆధిక్యం ఉన్న కాంగ్ పోక్పి జిల్లా సరిహ ద్దు సమీపంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. మొత్తం 16 మంది కట్టెల సేకరణ కోసం కొండ ప్రాంతానికి వెళ్లగా, అనుమానిత మిలిటెంట్లు వారిపై దాడి చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ముగ్గురు వ్యక్తులు కనిపించకుండా పోయినట్లు సమాచారం, కట్టెలను వాహనంలో ఎక్కిస్తున్న సమయంలో తమపై దాడి జరిగిందని గాయపడిన వారిలో ఒకరు వెల్లడించారు.



# వారి బెయిల్ పూచీకత్తులు తిరస్కరణ

## సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు

## అక్టోబర్ 21 వరకు కస్టడీ పొడిగింపు.. బెయిల్ పూచీకత్తుల తిరస్కరణ

**న్యూఢిల్లీ:** సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలకు సంబంధించి ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరోసారి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో వీరిద్దరి జ్యుడిషియల్ కస్టడీని అక్టోబర్ 21 వరకు పొడిగించారు. వీరు సమర్పించిన పూచీకత్తులను కూడా తిరస్కరించారు. అక్టోబర్ 11న ఇచ్చిన బాండ్ల నిబంధనలను ఉల్లంఘించి, వెంటనే శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడ్డారని ఢిల్లీలోని దక్షిణ-పశ్చిమ జిల్లా ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజి స్ట్రేట్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపై అలాంటి చర్యలకు పాల్పడబోమంటూ వారు ఇచ్చిన హామీపై నమ్మకం కలగడం లేదని స్పష్టం చేశారు. వారి ప్రవర్తన సక్రమంగా లేదని, చట్టాన్ని గౌరవించే ధోరణి కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తూ, పూచీకత్తులు సరిగా లేవని, తిరస్కరిస్తున్నామని పేర్కొన్నారు.

# అంతర్జాతీయ హనీ ట్రాపర్ అరెస్ట్

### ఫేక్ ఐడీలతో 13 ఇన్స్ స్టా

### 14 ఫేస్ బుక్ అకౌంట్స్

### వెయ్యి మందితో నిందితుడి చాటింగ్

### పోలీసులనూ 'మనీ' ట్రాప్ చేసిన నిందితుడు

**హైదరాబాద్ :** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో హనీ ట్రాప్ కేసును పోలీసులు ఛేదించారు. మహిళగా నటిస్తూ మూడు దేశాలు, నాలుగు రాష్ట్రా లలో మోసాలకు పాల్పడిన నిందితుడు కొండబత్తుల పవన్ కుమార్ను అరెస్టు అరెస్ట్ చేసినట్లు చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే తెలిపారు. నిందితుడు 1,000 మందికి పైగా వ్యక్తులతో చాటింగ్ చేసి దాదాపు రూ. 50 లక్షల వరకు చీటింగ్ చేసినట్లు విచారణ లో తేలిందన్నారు. రెండేళ్లవ్యవధిలో 82 మంది నగ్నఫొటోలు, వీడియోలు పంపాదని, 13 ఫేక్ ఇన్స్టాగ్రామ్, 14ఫేక్ ఫేస్బుక్ ఐడీలతో హనీ ట్రాప్లకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. బాధి తుల్లో దుబాయ్, టర్కీ, పాకిస్తాన్, కెనడా దేశాలకు చెందిన 9మందితో పాటు ఏపీ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వారు దాదాపు 50 మంది వున్నారన్నారు. నిందితుడి నుంచి మూడు సెల్ఫోన్లు, 3 సీమాకార్డులు, ల్యాప్ టాప్, పెనవ్ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈక్రమంలో సైదరాబాద్ పోలీసులు నిందితునిపై బీఎన్ఎస్ సెక్షన్స్ 308(7),351(2), ఐటీ యాక్ట్ సెక్షన్ 66సి, 66డి, 66ఏల కింద కేసు నమోదు చేసి రిమాం డకు తరలించారు.

#### కూకట్పల్లి కేంద్రంగా మోసాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పవన్ కుమార్ గత రెండేళ్లుగా హైదరాబాద్ నగరంలోని కూకట్పల్లి కేంద్రంగా హనీ ట్రాప్తో మోసాలు ప్రారంభించాడు. తొలుత నిందితుడు అమ్మాయిల పేర్లతో నకిలీ ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ ఖాతాలు సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి వారితో అమ్మాయిలా చాటింగ్ ప్రారంభిస్తాడు. క్రమంగా లైంగిక సంభా షణల వైపు వారి మళ్లించి ఇతరుల నగ్న చిత్రాలను పంపి, బాధితుల నుంచి కూడా వారి నగ్నఫోటోలను సేకరిస్తాడు. ఇలా సేకరించిన నగ్న ఫోటోలు, వీడియోలను తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, ఇతర సోషల్ మీడియా ఖాతాలలో భద్రపరుస్తాడు. తరువాత నిందితుడు పవన్కు కుమార్ తనకు అన్నయ్య అం టూ నిందితుడే బాధితులకు సందేశాలు పంపుతాడు. కాల్స్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా బాధితులను సంప్రదిస్తాడు. వారి ఆర్థిక పరి స్థితిని తెలుసుకుని బాధితులను వ్యక్తిగతంగా కలిసి పరిచయం పెంచుకుంటాడు. కొద్ది రోజుల తరువాత బాధితుల నగ్న ఫోటోలు, వీడియోలను చూపిస్తూ, తన చెల్లితో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయిస్తానని భయభ్రాంతులకు గురిచేసి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వసూళ్లకు పాల్పడుతాడు. నిందితుడు తన నకిలీ ఖాతాలలో కోల్కతాకు చెందిన చందన అనే అమ్మాయి ఫోటోలను ఉపయోగిస్తున్నట్లు గుర్తిం చిన పోలీసులు అక్కడి పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడు తనతో పాటు డిప్లొమా చదివిన స్నేహితుడిని సైతం హనీట్రాప్ చేసి రూ. 1 లక్షలు వసూలు చేశాడు. వీటితో పాటు పెట్టుబడులపై అధిక లాభాలు ఇప్పిస్తానని ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిని రూ. 7 లక్షలు, మరో ఇద్దరి నుంచి రూ. 30 లక్షల వరకు మోసం చేశాడని పోలీ సులు చెబుతున్నారు. బాధితుల జాబితాలో ఎక్కువగా డాక్టర్లు. వ్యాపారవేత్తలు, లెక్చరర్లు, ప్రైవేట్ ఉద్యోగులున్నట్లు తేలింది.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# సమష్టి సహకారంతో నల్గొండ జిల్లాలో వెట్టిచాకిరి నిర్మూలించాలి

## నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్ర శేఖర్

**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** అందరి సహకారంతో నల్గొండ జి ల్లాలో వెట్టిచాకిరి నిర్మూలించా ల ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అ న్నారు.సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో "అసంఘటిత రంగ కార్మికుల పై రూపొందించిన స్వేచ్ఛ రథాన్ని" జెండా ఊపి ప్రా రంభించారు. అనంతరం మాట్లాడుతూ వెట్టి చాకిరి, బానిసత్వం అనేది అ నాదిగా వస్తున్న సామాజిక రుగ్మత అని అన్నారు. వెట్టిచాకిరి నిర్మూ లనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చ ర్యలు చేపట్టిందని, ఇందులో భా గంగానే రాష్ట్ర వ్యా ప్తంగా ప్రచార రథాల ద్వారా ప్రజలకు అవగా హన కల్పించ నుందని, ఈ ప్రచా ర రథాలు 20 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టే ష న్లు, సంతలు, గ్రామ చావడీ లు ,జనసమ్మర్ధం ఎక్కువగా ఉం డే ప్రదేశాలలోవెట్టి చాకిరి, బాని సత్వం నిర్మూలనపై ప్రజలకు వి స్తృతంగా అవగాహన కల్పించ నున్నట్లు చెప్పారు. వెట్టి చాకిరిని నిర్మూలించే విషయమై కళాకారులు పాటలు, దృశ్య రూపకా లు, కరపత్రాలు, గోడపత్రికల రూపంలో అందరికీ విస్తృతంగా తెలియజేస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు వెట్టిచాకిరి పట్ల జా గరూకులై ఉండాలని, జిల్లాలో వె ట్టిచాకిరి పేరు వినప డకుండా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెట్టిచాకిరి పై ఎవరి కైనా సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 0806943434 3కు తెలియజేయాలన్నారు. వెట్టి చాకిరి, బానిసత్వ నిర్మూలనకు కార్మిక,రెవెన్యూ, పోలీస్, పంచా యతీరాజ్, తదితరశాఖల స మ న్వయం ముఖ్యమని, అందరి స హకారంతో వెట్టి చాకిరిని ర్మూల నకు కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, కార్మిక శాఖ ఉప కమీష నర్ చంద్రశేఖర్ గౌడ్, సహాయ క మిషనర్లు పి. అరుణ, సయ్యద్ మొయిజుద్దీన్, జిల్లా సంక్షేమ అ ధికారి లావణ్య, ఏ హెచ్ టియు అంజలి, సిడబ్ల్యుసి చైర్మన్ చిం తాకృష్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి గణేష్, కోఆ ర్డినేటర్ మహేష్, త దితరులు ఉన్నారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ వెట్టిచాకిరి నిర్మూలనపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.





### నల్గొండ అధికారుల సంక్షేమ సం ఘం జిల్లా ప్రజల అభివృద్ధికికృషి చేయాలి

**నల్లగొండ:** నూతనంగా ఏర్పా టైన "నల్గొండ అధికారుల సం క్షేమ సంఘం" (నోవా) జిల్లా ప్ర జల అభివృద్ధి, సంక్షేమానికి మ రింత కృషి చే యాలని జిల్లా కలె క్టర్ బి. చంద్రశేఖర్ పిలుపుని చ్చారు. ఆదివారం స్థానిక సం స్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ల ఆధ్వర్యంలో "న ల్గొండ అధికారుల సంక్షేమ సం ఘం" ఏకగ్రీవంగా ఎన్నికైంది.ఈ మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నూత నం గా ఎన్నికైన "నల్గొండ అధి కా రు ల సంక్షేమ సంఘానికి " శు భా కాంక్షలు తెలియజేశారు. "నోవా" తరుపున అభివృద్ధి, సంక్షేమ కా ర్యక్రమాలు ఇంకా పటిష్టంగా అ మలు చేయాలని, ప్రజలకు మే లు కలిగేలా కార్యక్ర మాలు చేప ట్టాలని కలెక్టర్ సూచించారు. కాగా "నల్గొండ జిల్లా అధికారుల సంక్షేమ సంఘం" చైర్మన్ గా రెవి న్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివా స్, ప్రెసిడెంట్ గా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి. విజయేం దర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీగా పరి శ్రమల శాఖ జనరల్ మేనేజర్ స తీష్ కుమార్, కోశాధికారిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎండి అక్బర్ అలీ, ఉపాధ్యక్షులుగా సాంఘిక సంక్షేమ శాఖ డిడి శశిక ళ, పంచాయతీరాజ్ ఈ ఈ ఎం గిరిధర్, జాయింట్ సెక్రటరీగా స మాచార శాఖ సహాయ సంచాల కులు యు. వెంకటేశ్వర్లు, ఆర్డ బ్ల్యూఎస్ డీఈ శాంతకుమారి, జిల్లా బి సి సంక్షేమ అధికారి ఏ. సంజీవ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి, ఎగ్జి క్యూటివ్ కమిటీ సభ్యులుగా జిల్లా ఉపాధి కల్పన అధికారి పి. సాహితీ ,జిల్లా సంక్షేమ అధికారి లావణ్య కుమారి, జిల్లా వ్యవసా య అధికారి వినోద్ కుమార్ లు వ్యవహరిస్తారు. నూతనంగా ఏ ర్పాటైన నోవా కు జిల్లా అధికా రులు శుభాకాంక్షలు తెలియ జే శారు.

# నల్లగొండలో పోలీసుల మెరుపుదాడులు

### 59 మంది అదుపులోకి, డ్రగ్స్ వినియోగంపై 15 మందికి పాజిటివ్‌గా ప్రాథమిక నిర్ధారణ

### రౌడీషీటర్లు, బ్లాక్ మెయిలర్లకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చ రిక



**ప్రజా దీవెన, నల్లగొండ క్రైమ్:** నల్లగొండలో అసాంఘిక శక్తులు, మత్తు పదార్థాల వినియోగదారులపై జిల్లా పోలీసులు ఉక్కుపా దం మోపుతున్నారు. ప్రజల భద్ర త, శాంతిభద్రతల పరిరక్షణే ల క్ష్యంగా వన్‌టౌన్, టూటౌన్, రూ రల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పో లీ సులు ప్రత్యేకంగా మెరుపు తని ఖీలు నిర్వహించారు. ఈ తనిఖీ ల్లో మొత్తం 59 మందిని అదుపు లోకి తీసుకోగా, డ్రగ్ పరీక్షల్లో 15 మంది గంజాయి లేదా మత్తు టా బ్లెట్లు వినియోగించినట్లు ప్రాథమి కంగా నిర్ధారణ అయినట్లు పోలీ సులు వెల్లడించారు.

### మత్తు పదార్థాల సరఫరాపై ప్రత్యేక నిఘా

నగరంలో గంజాయి, మత్తు టా బ్లెట్లు ఎక్కడి నుంచి వస్తున్నా యి? వాటిని సరఫరా చేస్తున్నది ఎవరు? అనే కోణాల్లో పోలీసు లు దర్యాప్తు చేస్తున్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చే సి, సరఫరాదారుల మూలాలను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాలకు అలవా టు పడిన వారిని గుర్తించి, అవస రమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పునరావాస కేం ద్రా లకు పంపించే చర్యలు తీసుకో నున్నట్లు తెలిపారు.

### బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్ చేస్తే కఠిన చర్యలు

రౌడీషీటర్లు, ట్రబుల్ మంగర్స్, అ సాంఘిక శక్తులు, బ్లాక్‌మెయిలర్ల కదలికలపై నిరంతరం నిఘా కొన సాగుతుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. బె దిరింపులు, అక్రమ సెటిల్‌మెం ట్లు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్ప డుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉ పేక్షించబోమని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకోకుంటే చట్ట ప్ర కారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### సమాచారం ఇవ్వండి.. పోలీసులకు సహకరించండి

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందిస్తార ని ఎస్పీ తెలిపారు. మత్తు పదా ర్థాల విక్రయాలు, వినియోగం, బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్ వంటి అసాంఘిక కార్యకలాపా ల పై సమాచారం ఉంటే వెంటనే పో లీసులకు తెలియజేయాలని కో రారు. పోలీసుల అత్యవసర సహాయం 112, గంజాయి, మత్తు పదార్థా ల నిరోధక టోల్‌ఫ్రీ నంబర్ 871 2670266 తో ప్రజలు నిర్భ యంగా జీవించే వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీసులు ప్రత్యేక తనిఖీ లు, నిఘా చర్యలను కొనసాగిం చనున్నట్లు తెలిపారు.ఈ తనిఖీ ల్లో నల్లగొండ డీఎస్పీ శివరాం రె డ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు ముత్తయ్య, సైదులు, టూటౌన్ ఎస్ఐ సైదాబాబు, రూ రల్ ఎస్ఐ శివప్రసాద్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శాలిగౌరారం బస్టాప్ వద్ద జమ్మి చెట్టు నరికివేత.. గ్రామస్థుల ఆగ్రహం



**శాలిగౌరారం :** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని బస్టాప్ సమీపంలో ఉన్న దసరా దిమ్మె వద్ద గల జమ్మి చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున విషయం తెలుసుకున్న శాలిగౌరారం సర్పంచ్ గుజిలాల్ శేఖర్ బాబు శాలిగౌరారం ఎస్ ఐ పి. బాబు కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి. బాబు సంఘటనా స్థలాన్నితన సిబ్బందితో పరిశీలించారు. జమ్మి చెట్టును నరికిన తీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. శాలిగౌరారం గ్రామంలో దసరా పండుగను ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో 2004 అక్టోబర్ 22న అప్పటి గ్రామ సర్పంచ్ చాడ చంద్రకళ – హతీష్ రెడ్డి ఆధ్వర్యంలో దసరా దిమ్మెను ఏర్పాటు చేశారు . 2023లో గ్రామ సర్పంచ్ బట్ట హరిత – వీరబాబు దసరా దిమ్మె పై జమ్మి చెట్టును ఏర్పాటు చేసి దానికి మరింత వైభవాన్ని తీసుకొచ్చారు. ప్రస్తుత గ్రామ సర్పంచ్ గుజిలాల్ శేఖర్ బాబు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేయించి, ఆధునిక డిజైనింగ్‌తో దసరా దిమ్మెను మరింత అందంగా తీర్చిదిద్దారు. దసరా ఉత్సవాలు మరింత ఘనంగా చేసే క్రమంలో ఎంతోమంది కృషితో అందంగా తీర్చిదిద్దుకున్న జమ్మి చెట్టును దుండగులు నరికివేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జమ్మి చెట్టు అంటే కేవలం ఒక చెట్టు కాదని, అది గ్రామ సంస్కృతికి, దసరా సంప్రదాయానికి ప్రతీక అని, ఇలాంటి పవిత్ర సంప్రదాయానికి విఘాతం కలిగించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# తిరుమలరాయునిగూడెంలో ఘనంగా అన్నప్రసాదం



**శాలిగౌరారం :** శ్రీ దుర్గాదేవి 18 శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాలిగౌరారం మండలం తిరుమలరా యునిగూడెం గ్రామంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాడ కవిత –సురేష్ రెడ్డి, అన్నదాన దాతలు, దుర్గాదేవి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజలు

### జిల్లా ప్రజలకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజయదశమి శుభా కాంక్షలు

### ప్రజల రక్షణే లక్ష్యంగా అంకిత భావంతో విధులు నిర్వహించాలి



**ప్రజా దీవెన, నల్లగొండ క్రైమ్ :** విజయదశమి పర్వదినాన్ని పు ర స్కరించుకుని నల్లగొండ జిల్లా పో లీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పో లీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలను ఘనంగా ని ర్వహించారు. పోలీస్ కార్యాల యంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభా గంలో ఆయుధాలకు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎం.టి.) విభాగంలో పోలీస్ వాహనాలకు సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వ హించారు. జిల్లా ఎస్పీ శరత్ చం ద్ర పవార్ ఐపీఎస్ ఈ కార్యక్రమం లో పాల్గొని పూజలు నిర్వహిం చారు.

### ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చం ద్ర పవార్ మాట్లాడుతూ.. చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు. దుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయు రారోగ్యాలు, శాంతి, సౌభాగ్యా లు కలగాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, వ్యవ సాయ రంగాల్లో ప్రజలు అభివృ ద్ధి సాధిస్తూ విజయపథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావం తో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపు నిచ్చారు.



### ప్రజల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యం

ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో నిర్వ హించిన ఆయుధ పూజలో విధి నిర్వహణలో కీలకమైన ఆయు ధాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పా టు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు మరింత అంకితభా వంతో పనిచేయాలని ఈ సం దర్భంగా ఆకాంక్షించారు. అనంతరం ఎం.టి. విభాగంలో పోలీస్ వాహనాలకు పూజలు ని ర్వహించారు. నేరాల నియంత్ర ణ, అత్యవసర పరిస్థితుల్లో స త్వర స్పందన, ప్రజలకు సమర్థ వంతమైన సేవలు అందించడం లో పోలీస్ వాహనాలు కీలక పా త్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవ లు అందించాలని సూచించారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర కృషి

పోలీస్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా విజ యదశమి సుఖసంతోషాలు, ఆ రోగ్యం, విజయాలను అందిం చా లని ఎస్పీ ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో నల్లగొండ జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటి ష్టంగా కొనసాగిస్తూ, ప్రజలకు మె రుగైన పోలీస్ సేవలు అందించేం దుకు జిల్లా పోలీస్ శాఖ నిరంత రం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎ స్పీ రమేష్, ఎస్బీ సీఐ నాగరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, న ల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను, నరసింహ, సురప్ప నాయుడు, హరిబాబు, కళ్యాణ్ రాజ్ త ది తర పోలీస్ అధికారులు, సిబ్బం ది పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోనేందుకు 300 రోజుల కార్యాచరణ

## నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కీలక ఆదేశం









**ప్రజా దీవెన, నల్లగొండ:** ఎల్‌నినో నేపథ్యంలో రానున్న 300 రోజులు అత్యంత కీలకమని, తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధి కారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రతి నీటి చుక్కను పొదుపు గా వినియోగించుకోవాలని, ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెల ల్లో తాగునీటి కొరత ఏర్పడకుం డా ఇప్పటి నుండే అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగం గా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దర ఖాస్తులు స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షిం చారు.గ్రామాలు, మున్సిపల్ ప ట్టణ ప్రాంతాలలో తాగునీటికి ఇ బ్బంది రాకుండా వచ్చే ఆగస్టు వరకు నీటి సరఫరాకు ఇబ్బం దు లు లేకుండా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో నీటి వనరులకు సంబంధించిన రిజిస్టర్లను నిర్వ హించాలని, నీటి సరఫరా వ్యవ స్థలో లీకేజీలను అరికట్టాలని, పాడైన పైపులు, ట్యాంకులకు వెంటనే మరమ్మతులు చేపట్టా లని తెలిపారు. పబ్లిక్ హెల్త్ శాఖ, మిషన్ భగీర థ, అమృత్ పథకం అధికారుల తో సమన్వయం చేసుకొని నీటి సరఫరా ప్రణాళికను సిద్ధం చే యాలని చెప్పారు.పట్టణ ప్రాంతాల్లోనూ నీటిని పొదుపుగా విని యోగించే విధానాలను అమలు చేయాలన్నారు.వాహనాలను పై పులతో కడగకుండా బకెట్ నీటి తో శుభ్రం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, దు కాణాలు, వాహనాల శుభ్రత కేంద్రా ల్లోనూ నీటి వృథాను నివారించాలని ఆదేశించారు. నీటిని వృథా చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, నీటి కొరతపై ప్ర జలకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగానికి ఇబ్బందు లు కలగకుండా వ్యవసాయ అధి కారులు రైతులకు ముందస్తు సూచనలు చేయాలని కలెక్టర్ తెలిపారు. యాసంగిలో వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో పండే వేరు శనగ, జొన్నలు, మినుములు, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించా రు. 90 రోజుల్లో పండే పంటలపై రైతులకు వివరించాలని, పండిం చిన పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా చ ర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ప్రస్తుతం ఉ న్న నీటి నిల్వలను తక్షణమే గు ర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా నీటి కొరత ఉంటే భూ గర్భ జలవనరులు, మిషన్ భగీ రథ ద్వారా ప్రత్యామ్నాయ ఏ ర్పాట్లు చేసి పిల్లలు, విద్యార్థు లు, రోగులకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామాల్లో పశువులు, అటవి జంతువులకు తాగునీటి కొరత ఏర్ప డకుండా నీటి లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన ఏ ర్పాట్లు చేయాలని, నీరు అందక జంతువులు మృత్యువాత పడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.పీఎం సూర్య ఘర్ పథ కం కింద ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునే లా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలపై వివరించాలని, సోలార్ పంపు సెట్ల వినియోగాన్ని ప్రోత్సహించా లని అన్నారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలోనూ సోలార్ వ్య వస్థ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా గ్రామీణ అభి వృద్ధి అధికారి టి. శేఖర్ రెడ్డి , జి ల్లా అధికారులు ప్రజల వద్ద నుం డి ఫిర్యాదులను స్వీక రించారు. కాగా ఈ సోమవారం రెవిన్యూ శాఖకు(21) ఫిర్యాదులు, ఇతర శాఖలకు(28) ఫిర్యాదులు మొ త్తం(49) ఫిర్యాదులు వచ్చాయి.

### జిల్లా రైతులకు విస్తృతంగా బ్యాంకింగ్ సేవలు అందించాలి

నల్లగొండ: ఎల్‌నినో నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు విస్తృతంగా బ్యాం కింగ్ సేవ లు అందించాలని జిల్లా కలెక్టర్,నల్లగొండ జిల్లా కేంద్ర స హకా ర బ్యాంకు (ఎన్‌డీ సీసీబీ) అధికారిక పర్సన్ ఇన్‌చార్జి బి. చంద్ర శేఖర్ అన్నారు. వసూలు కానీ మొండి బకాయిలను (ఎన్ పి ఏ) తగ్గించేందుకు బ్రాంచ్ మేనేజర్లు కృషి చేయాలని చెప్పారు. సోమ వారం ఆయన క్లాక్ టవర్ సమీపంలో ఉన్న డి సిసి బ్యాంకు ప్ర ధాన కార్యాలయంలో నిర్వ హించిన బ్రాంచ్ మేనేజర్ల సమా వేశం లో రైతులకు రుణాల మం జూరులో ఎలాంటి అలసత్వం వ హించకూడదని, ప్రతి బ్రాంచ్‌లో డిపాజిట్ల సేకరణను పెంచి రూ. 100 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణసదుపా యా లు కల్పిస్తూ బ్యాంకు పనితీ రు ను మెరుగుపరచాలని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు చిన్న చిన్న రుణాలు ఇ వ్వడం వల్ల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుం టారని, వారు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వ్యాపారాలు, ఆర్థిక కా ర్యకలాపాల నిర్వహణకు రు ణాలు ఇచ్చి ఆదుకుంటే బ్యాంకు పై వారికి నమ్మకం కలుగుతుందన్నారు.బ్యాంకు సీఈఓ శంకర్రా వు,జాయింట్ రిజిస్ట్రార్ మైఖేల్ బోస్, జనరల్ మేనేజర్ నర్మద, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి బ్యాంకు సీనియర్ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లు హాజరయ్యారు.

### పకడ్బందీగా కంప్యూటర్ ఆధారి త నియామక పరీక్షలు

**నల్లగొండ:** తెలంగాణ పబ్లిక్ సర్వీ స్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 26 తేదీలలో నిర్వహించను న్న టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్( అనలిస్ట్ గ్రేడ్ -2), మరియు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కంప్యూటర్ ఆధారిత ని యామక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చే యాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. సో మవారం టిజిపిఎస్ సి చైర్మన్ , విశ్రాంత ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశం హైదరాబాద్ నుండి

టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ -2), మరియు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇం జనీర్ కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షల ఏర్పాట్లపై వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పై పరీక్షల నిర్వహ ణ ఏర్పాట్లపై జిల్లా అధికారుల తో సమీక్షించారు.

టిజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వ హించనున్న అసిస్టెంట్ సైంటి స్ట్( అనలిస్ట్ గ్రేడ్ -2), మరియు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షకు నల్గొండ పట్టణంలోనినేతాజీ నగర్ (రామ గిరి)లో ఉన్న ఎస్పీఆర్ పాఠశాల లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి నట్లు ఆయన తెలిపారు.ఈ నెల 24 న నిర్వహించనున్న అసిస్టెం ట్ సైంటిస్ట్( అనలిస్ట్ గ్రేడ్ -2) పరీక్షకు (185) మంది అభ్యర్థులు, 26 న నిర్వహించనున్న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు

(180) మంది అభ్యర్థులు హా జరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గం టల వరకు రెండు పూటలు ఉం టాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి 1 గంట ముందుగానే పరీక్ష కేంద్రా నికి చేరుకోవాలని, పరీక్ష ప్రా రం భానికి 30 నిమిషాల ముందే గే ట్లు మూసి వేయడం జరుగుతుం దని స్పష్టం చేశారు.పై పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఇందులో భాగంగా పరీక్ష కేంద్రం లోపల, వెలుపల తగినంత బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్పీని కోరారు. పరీక్షలు నిర్వహించే రోజున టిఎస్ ఆర్ టిసి తగినన్ని బస్సులు నడపాలని ఆర్టీసీ అధి కారులను ఆదేశించారు.పరీక్ష రో జున పరీక్ష కేంద్రం వద్ద,లోపల నిరంతర విద్యుత్ సరఫరా ఉం డేలా చర్యలు తీసుకోవాలని వి ద్యుత్ అధికారులను ఆదేశించా రు. కాగా అభ్యర్థులకు తాగు నీ రు, పరీక్షా కేంద్రంలో పరిశుభ్రత ఏర్పాటు చేయాలని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్ ను ఆదేశించారు. అత్య వ సర మందులతో పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయా ల ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధి కారిని ఆదేశించారు. పరీక్షలు స వ్యంగా నిర్వహించేందుకు ఫ్ల యింగ్ స్క్వాడ్ ను ఏర్పాటు చే సి, పోలీసు బందోబస్తు కల్పిం చాలని, పరీక్షలకు ఎలాంటి అం తరాయం కలగకుండా పరిసర ప్రాంతాల్లో తగిన బందో బస్తు చర్యలు తీసుకోవాలని తె లిపా రు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా అన్ని ఏర్పా ట్లు ముందుగానే పూర్తి చేయాల ని జిల్లా కలెక్టర్ అధికారులను ఆ దేశించారు. రెవెన్యూ అదనపు క లెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థ ల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, జిల్లా అ ధికారులు ఉన్నారు.







# అన్ని దానముల కంటే అన్నదానం గొప్పది

**ప్రజా దీవెన, కోదాడ** అన్ని దానముల కంటే అన్నదానం చాలా గొప్పదని అందుకు దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని మునగాల ఎస్ ఐ సంజీవరెడ్డి ఎమ్మెస్ విద్యాసంస్థల చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పందిరి నాగిరెడ్డి లు అన్నారు శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం నాడు మునగాల మండలం ముకుందాపురం గ్రామంలో శివ దుర్గ యూత్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమము నిర్వహించారు ఈ కార్యక్రమానికి .ముఖ్య అతిథులుగా వారు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు మండల ప్రజలపై ఉండాలని సుభిక్షంగా సుఖశాంతులతో పాడిపంటలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు అమ్మవారి మండపం వద్ద పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసిన శివదుర్గ యూత్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు నర్రా సత్యనారాయణరెడ్డి, గ్రామస్తులు నర్రా ఇంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సరికొండ నాగరాజు, నూకమల్ల రామకృష్ణ, లక్ష్మయ్య, ఉపేందర్, అప్పిరెడ్డి, యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో యస్ యస్ రావు, పందిరి ఫౌండేషన్ సభ్యులు గోపి రాథోడ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. శివ దుర్గ యూత్ వారు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



# దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహాయ సహకారాలు అన్ని వేళలా ఉంటాయి.**

**అన్నదానాలు పుణ్య కార్యాలు.**

**బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక: సంధ్య వెంకటేశ్వర్లు**

**ప్రజా దీవెన, కోదాడ :** దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని కూచిపూడి గ్రామ సర్పంచ్ కాసాని సంధ్య వెంకటేశ్వర్లు అన్నారు సోమవారం కోదాడ మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గా మాత విగ్రహం వద్ద ,ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆమె అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పండుగలు, ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి,



సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భక్తిశ్రద్ధలతో దుర్గా మాతను ఆరాధిస్తూ ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని తెలిపారు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆమె తెలిపారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు

ప్రజలంతా పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ, ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ అన్నదాన కార్యక్రమంలో శెట్టి శ్రీనివాసరావు , శిరంశెట్టి నాగేశ్వరరావు, శిరంశెట్టి వెంకటేశ్వర్లు, శిరంశెట్టి బాబురావు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చాప రాముడు, కోటేశ్వరరావు, రెడ్డిపూడి కొండ, శిరంశెట్టి గోపి, ముత్యాల వీరయ్య, బ్రహ్మయ్య, వెంకటనారాయణ, గాలి బాబు తదితరులు పాల్గొన్నారు.

# వంగమర్తి బతుకమ్మ వేడుకల్లో ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రధానం



**శాలిగౌరారం :** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందంగా బతుకమ్మలను తయారుచేసిన వారికి సకినాల మల్లమ్మ జ్ఞాపకార్థం బహుమతులు అందజేశారు. వంగమర్తి గ్రామ సర్పంచ్ సకినాల వరలక్ష్మి - నరసయ్య బహుమతులను ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి సురబోయిన శైలజ (రూ.1000), ద్వితీయ బహుమతి మన్నెం రేణుక (రూ.500), తృతీయ బహుమతి బెల్లి మారెమ్మ (రూ.500) గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ అయిలపాక శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవాలి : శాలిగౌరారం ఎస్సై బాబు

**శాలిగౌరారం :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా పండుగను ప్రజలందరూ సంతోషంగా, ఘనంగా జరుపుకోవాలని శాలిగౌరారం ఎస్సై పి.బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూడాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



# పురుషుల జట్టు చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా

## బీసీసీఐ కీలక నిర్ణయం..



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురుషుల జట్టు సెలక్షన్ కమిటీలో కీలక మార్పులు చేసింది. చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజాను నియమించగా, మాజీ క్రికెటర్ రమేశ్ పొవార్‌కు కమిటీలో చోటు కల్పించింది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి తప్పుకొన్న నేపథ్యంలో సెలక్షన్ కమిటీ కొత్త కూర్పును బీసీసీఐ ప్రకటించింది. బీసీసీఐ సోమవారం విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం.. క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) రమేశ్ పొవార్ నియామకాన్ని ఏకగ్రీవంగా సిఫారసు చేసింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపేలతో కూడిన సీఏసీ.. దరఖాస్తులను పరిశీలించి, బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. టెస్టు మ్యాచ్‌ల్లో ఆడిన మ్యాచ్‌ల సంఖ్య ఆధారంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ప్రజ్ఞాన్ ఓజా సెలక్షన్ కమిటీకి అధ్యక్షత వహించనున్నాడు. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో శివ్ సుందర్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రాతో పాటు రమేశ్ పొవార్ సభ్యులుగా కొనసాగనున్నారు. రమేశ్ పొవార్ భారత జట్టు తరఫున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడాడు. ఆటగాడిగా కెరీర్ ముగిసిన తర్వాత కోచ్‌గా సేవలందించాడు. భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేయడంతో పాటు ముంబై, గుజరాత్ జట్లకు కోచింగ్ బాధ్యతలు నిర్వహించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ కోచ్‌గానూ పనిచేశాడు. పొవార్ కోచ్‌గా ఉన్న సమయంలో భారత మహిళల జట్టు ఆసియా కప్ టైటిల్ గెలుచుకోవడంతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించింది.

మరోవైపు, చీఫ్ సెలెక్టర్‌గా పనిచేసిన అజిత్ అగార్కర్ సేవలను బీసీసీఐ ప్రశంసించింది. 2023 జులైలో బాధ్యతలు చేపట్టిన అగార్కర్ పదవీకాలంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు గెలిచిందని తెలిపింది. ఆసియా క్రీడల్లో వరుసగా రెండు స్వర్ణ పతకాలు సాధించిన విజయాల్లోనూ ఆయన పదవీకాలం కీలకంగా నిలిచింది.

పురుషుల జట్టు సెలక్షన్ కమిటీ సభ్యులు:
ప్రజ్ఞాన్ ఓజా – ఛైర్‌పర్సన్
శివ్ సుందర్ దాస్ – సభ్యుడు
ఆర్పీ సింగ్ – సభ్యుడు
అజయ్ రాత్రా – సభ్యుడు, రమేశ్ పొవార్ – సభ్యుడు

# ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట షురూ..

### షూటింగ్‌లో స్వర్ణం, రజతం



జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న 2026 ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది. పోటీల తొలిరోజైన సోమవారం, భారత పారా షూటర్లు పతకాల వేట ప్రారంభించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 విభాగంలో భారత క్రీడాకారిణులు మోనా అగర్వాల్ స్వర్ణం, అవనీ లేఖరా రజతం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ గేమ్స్‌లో భారత్‌కు ఇవే తొలి పతకాలు కావడం విశేషం. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా గేమ్స్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల స్వల్ప తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ అవనీ లేఖరా వెనుకబడింది. అవనీ 249.6 పాయింట్లతో రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి 227.9 పాయింట్లతో కాంస్య పతకం గెలుచుకుంది. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో కూడా భారత షూటర్లే ఆధిపత్యం ప్రదర్శించారు. మోనా అగర్వాల్ 629.1 పాయింట్లతో గేమ్స్ రికార్డు నెలకొల్పి అగ్రస్థానంలో నిలవగా, అవనీ లేఖరా 626.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలిరోజే రెండు పతకాలతో భారత్ ఈ మెగా ఈవెంట్‌లో తన ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించింది.

# టీ20ల్లో షఫాలీ సరికొత్త చరిత్ర

## కెప్టెన్ రికార్డునే బ్రేక్ చేసిన ఓపెనర్



భారత మహిళల క్రికెట్ జట్టు యువ ఓపెనర్ షఫాలీ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టి, టీమిండియాకు ఘన విజయాన్ని అందించింది. ఈ విజయంతో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. రాయ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో షఫాలీ కేవలం 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 భారీ సిక్సర్ల సాయంతో 55 పరుగులు చేసింది. ఈ క్రమంలో మహిళల టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక 50కిపైగా స్కోర్లు చేసిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. 2026లో షఫాలీకి ఇది 9వ యాభైకి పైగా స్కోరు (ఒక సెంచరీ, ఎనిమిది హాఫ్ సెంచరీలు). ఇంతకుముందు ఈ రికార్డు భారత కెప్టెన్ స్మృతి మంధాన పేరిట ఉండేది. మంధాన 2024లో ఎనిమిది 50కిపైగా స్కోర్లు సాధించింది. తాజాగా తన కెప్టెన్ రికార్డునే షఫాలీ అధిగమించడం విశేషం. ఈ ఏడాది ఇప్పటివరకు 26 టీ20 మ్యాచ్‌లలో షఫాలీ మొత్తం 922 పరుగులు చేసింది. 103 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో స్మృతి మంధానతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన షఫాలీ, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఈ జోడీ తొలి వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి విజయాన్ని ఖాయం చేసింది. షఫాలీ 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని ఔటవగా, మంధాన 25 బంతుల్లో 47 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించింది. భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన జింబాబ్వే, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే బ్యాటర్లు తడబడ్డారు. నికీ ప్రసాద్ 7 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టగా, మిగతా బౌలర్లు కూడా రాణించారు. జింబాబ్వే జట్టులో చిపో ముగేరి-తిరిపానో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ సిరీస్ విజయంతో, భారత మహిళల జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్మృతి మంధాన తన తొలి సిరీస్‌ను గెలుచుకున్నట్లయింది.

# అంబానీల నవరాత్రి వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్‌గా ధోనీ..



టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, అతని అర్ధాంగి సాక్షి.. అంబానీ కుటుంబం నిర్వహించిన నవరాత్రి వేడుకల్లో సందడి చేశారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ టౌన్‌షిప్‌లో నిన్న జరిగిన ఈ వేడుకల్లో అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌తో కలిసి ధోనీ దంపతులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్నివాల్‌లో ధోనీ, అనంత్ అంబానీ సరదాగా గడిపారు. ఇద్దరూ కలిసి డ్రాగన్ బోట్ వంటి ఫాస్ట్ రైడ్‌ను ఎంజాయ్ చేశారు. అభిమానులతో ముచ్చటిస్తూ, సాక్షితో కలిసి ఐస్‌క్రీం తింటూ ధోనీ చాలా కూల్‌గా కనిపించారు. ఈ కార్నివాల్‌లో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గిరగిరా తిరిగే ఒక రైడ్ ఎక్కమని అనంత్ అంబానీ ధోనీని ఆహ్వానించారు. అయితే, దానికి ధోనీ సున్నితంగా నిరాకరించారు. ఆ రైడ్ ఎక్కితే తనకు కళ్లు తిరుగుతాయని సరదాగా సైగలు చేస్తూ వివరించారు. అంబానీ కుటుంబం ఏర్పాటు చేసిన ఈ నవరాత్రి వేడుకల్లో కార్నివాల్ రైడ్స్‌తో పాటు గర్బా, ఇతర కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ధోనీ, అనంత్ అంబానీ కలిసి గడిపిన క్షణాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# 102 ఏళ్లలో ఇదే తొలిసారి... దక్షిణాఫ్రికా జట్టులో అరుదైన రికార్డు!

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు 102 ఏళ్ల తర్వాత ఒక చారిత్రక రికార్డును పునరావృతం చేసింది. ఆస్ట్రేలియాతో గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తుది జట్టులో ఏకంగా 8 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడిన వారే ఉండటం విశేషం. ఇంతకుముందు 1924లో ప్రొటీస్ జట్టులో ఇలాంటి కూర్పు కనిపించింది. శతాబ్ద కాలం తర్వాత మళ్లీ అదే సీన్ రిపీట్ కావడం క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆదివారం ప్రారంభమైన ఈ టెస్టు మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారింది. తొలి రోజు కేవలం 12.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. డర్బన్‌లో జరిగిన తొలి టెస్టులో 214 పరుగుల తేడాతో ఓటమిపాలైన దక్షిణాఫ్రికా... రెండో టెస్టు కోసం జట్టులో మూడు మార్పులు చేసింది. 30 ఏళ్ల మార్క్వెస్ అకర్‌మన్‌కు అరంగేట్రం అవకాశం ఇవ్వగా, కగిసో రబడ, మాథ్యూ బ్రీట్జ్కేలను తిరిగి జట్టులోకి తీసుకుంది. ఈ మార్పుల వల్లే తుది జట్టులో 30 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 8కి చేరింది. దక్షిణాఫ్రికా జట్టులో స్పిన్నర్ సైమన్ హార్మర్ (37) అత్యంత పెద్ద వయస్కుడు కాగా, ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ (26) అత్యంత పిన్న వయస్కుడు. మరోవైపు, ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టులో అయితే తుది జట్టులోని 11 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడిన వారే కావడం మరో విశేషం. అనుభవానికే పెద్దపీట వేస్తూ ఆసీస్ బరిలోకి దిగింది. ఆ జట్టులో మాట్ రెన్‌షా (30) అత్యంత చిన్నవాడు కాగా, స్టీవ్ స్మిత్, స్కాట్ బోలాండ్ (37) సీనియర్ ఆటగాళ్లుగా ఉన్నారు. మొత్తం మీద ఈ టెస్టులో ఇరు జట్లలో కలిపి 19 మంది ఆటగాళ్లు 30 ఏళ్లకు పైబడిన వారే బరిలోకి దిగారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఇంతమంది సీనియర్ ఆటగాళ్లు ఆడటం ఇది రెండోసారి మాత్రమే. 1926లో ఇంగ్లండ్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లో 20 మంది 30 ఏళ్లు పైబడిన ఆటగాళ్లు ఆడారు. ఇక ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 20 పరుగులు చేసింది. రెండు వికెట్లనూ స్కాట్ బోలాండ్ పడగొట్టాడు.

# రింకూ సింగ్ మళ్లీ మెరిశాడు

### రంజీల్లో వరుసగా రెండో సెంచరీ.. సెలక్టర్లకు గట్టి సమాధానం



టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ సంచలనం రింకూ సింగ్, తన ప్రదర్శనతో బీసీసీఐ సెలక్టర్ల తలుపును గట్టిగా తడుతున్నాడు. జాతీయ జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో వరుసగా రెండో సెంచరీ బాది, తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గోవాతో జరుగుతున్న మ్యాచ్‌లో ఒంటరి పోరాటం చేసి అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు. నిన్న కాన్పూర్‌లో గోవాతో ప్రారంభమైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరప్రదేశ్, కేవలం 33 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు అభిషేక్ గోస్వామి (5), ఆర్యన్ జుయల్ (14), కెప్టెన్ కరణ్ శర్మ (0) ఘోరంగా విఫలమయ్యారు. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్, అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరోవైపు పట్టుదలగా నిలబడి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. తన సహజ శైలికి భిన్నంగా ఓపికగా ఆడి, జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. తన అజేయ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 118 పరుగులు సాధించాడు. అతని పోరాటంతో ఉత్తరప్రదేశ్ జట్టు 71 ఓవర్లలో 202 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఈ సీజన్‌లో బిహార్‌పై కూడా రింకూ (112) శతకం సాధించడం గమనార్హం. ఇటీవలే జింబాబ్వే సిరీస్ తర్వాత రింకూను జాతీయ జట్టు నుంచి తప్పించారు. ఆపై న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో, అతను దేశవాళీ టోర్నీలో వరుస సెంచరీలతో చెలరేగడంతో, సోషల్ మీడియాలో అభిమానులు సెలక్టర్ల తీరును ప్రశ్నిస్తున్నారు. ఇంత నిలకడగా ఆడుతున్న ఆటగాడిని ఎందుకు విస్మరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే.. గోవా బౌలర్లలో లెగ్ స్పిన్నర్ యశ్ కస్వంకర్ 86 పరుగులిచ్చి 5 వికెట్లతో ఉత్తరప్రదేశ్ పతనాన్ని శాసించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా, తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో శివేంద్ర భుజబల్ (31 నాటౌట్), సుయాష్ ప్రభుదేశాయ్ (12 నాటౌట్) ఉన్నారు. గోవా ఇంకా 159 పరుగులు వెనుకబడి ఉంది.



## తెలంగాణ కోడలిని అంటూ నేషనల్ క్రష్ సగర్వంగా!

పాన్ ఇండియా లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న మ-రోసారి వినయంతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలతో బిజీగా ఉండే కథానాయికల్లో ఒకరిగా ఉన్నా? సాంప్రదాయాలకు, స్థానిక సంస్కృతికి రష్మిక ఇచ్చే గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో రష్మిక పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక తెలంగాణ మహిళలతో కలసి రష్మిక ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడటం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి.. ఆనందానికి గురిచేసింది. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య మహిళలతో కలిసి పాటలు పాడుతూ అడుగులు వేస్తూ వేడుకలను జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఒక స్టార్ హీరోయిన్ ఇలా వీధిలో అందరితో కలిసిపోవడం, స్థానిక పండుగలో పాలుపంచుకోవడం ఆమెలోని ఎంతో సింపుల్ స్వభావాన్ని ఆవిష్కరించింది.

ఈ వేడుకల సందర్భంగా రష్మిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. -నేను తెలంగాణ కోడలిని. తెలంగాణ ఇంటి ఆడపడుచునని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నాను- అని సంతోషంగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు చూపించే ఆప్యాయత, ప్రేమ తనకు ఎంతో ప్రత్యేకమైనవని, ఈ నేలతో తనకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని భావోద్వేగంతో వెల్లడించారు. ఈ మాటలు విన్న తెలంగాణ ప్రజలు, అభిమానులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

రష్మిక ఇంత సరళంగా.. సంస్కారవంతంగా ఉండటం చూసి విజయ్ దేవరకొండ నిజంగా ఎంతో లక్కీ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కుటుంబంతో.. ఆయన మూలాలతో రష్మికకు ఉన్న అనుబంధం గురించి ఇండస్ట్రీలో ఎప్పటినుంచో ఆసక్తికరమైన చర్చలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక తెలంగాణ సంస్కృతిని తన సొంత సంస్కృతిగా భావించి ఇంత గౌరవంగా బతుకమ్మ ఆడటం వారి బంధానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టింది.



## కొత్త మూవీ.. మహేష్ మారిపోయాడు!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటేనే తక్కువ ప్రమోషన్లు.. సినిమా రిలీజ్ కు ముందు తక్కువ ఇంటర్వ్యూలు, ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ తోనే ఆయన తన మూవీ ప్రమోషన్స్ ను కంప్లీట్ చేస్తారనే పేరుంది. మిగతా హీరోల్లా వరుసగా మీడియా మీట్స్ లో పాల్గొనడం, వేర్వేరు సిటీస్ తిరుగుతూ సినిమాను ప్రమోట్ చేయడం, సోషల్ మీడియాలో సందడి చేయడం పెద్దగా అలవాటు లేదు. కొంతకాలంగా మహేష్ బాబు అలాగే చేస్తున్నారు. కానీ ఇప్పుడు తన కొత్త మూవీ.. దర్శకధీరుడు రాజమౌళితో చేస్తున్న వారణాసి సినిమా కోసం మాత్రం మహేష్ బాబు ఇప్పుడు తన పద్ధతిని మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు ప్రమోషన్లకు పెద్దగా సమయం కేటాయించని ఆయన.. ఈసారి నెలల ముందే ప్రమోషనల్ ఈవెంట్స్ కు రెడీ కావాల్సి వస్తోందట. నిజానికి ఆ సినిమాను వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలనేది మూవీ టీమ్ బిగ్ టార్గెట్. అందుకే ప్రమోషన్స్ కు సంబంధించి ఇప్పటికే స్పెషల్ ప్లాన్ ను మేకర్స్ రెడీ చేసినట్లు సమాచారం. ఏయే నెలల్లో, ఏయే తేదీల్లో అందుబాటులో ఉండాలనే వివరాలతో మహేష్ కు ఓ షెడ్యూల్ అందినట్లు ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. జనవరి 2027 నుంచి ఏప్రిల్ 7వ తేదీ సినిమా విడుదలయ్యే వరకు ఆయన ప్రమోషనల్ ఈవెంట్స్ కోసం కోసం కంప్లీట్ గా టైమ్ కేటాయించాల్సి ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో సాధారణంగా సినిమా విడుదలకు కొద్ది రోజుల ముందు మాత్రమే ప్రమోషన్స్ లో కనిపించే మహేష్ బాబు.. ఈసారి దేశంలోని మెయిన్ సిటీస్ తో పాటు ఇంటర్నేషనల్ స్టేజెస్ పై సందడి చేయాల్సి రావచ్చు. ముఖ్యంగా వరల్డ్ వైడ్ గా సినిమాను ప్రేక్షకులకు పరిచయం చేయాలంటే హీరో కూడా ప్రమోషన్స్ లో చురుగ్గా ఉండటం అవసరం. అందుకే తన ఎప్పుడూ ఫాలో ప్రాసెస్ ను పక్కన పెట్టి, ప్రమోషన్స్ కు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

## వారసుడి సినిమాలో సింహం ఓ మెరుపులా!



యంగ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ట దర్శకత్వంలో నందమూరి వారసుడు మోక్షజ్ఞ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఎంతో మంది దర్శకుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా? చివరికి -బింబిసార- ఫేం వశిష్ట వైపు నందమూరి బాలకృష్ణ మొగ్గు చూపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నందమూరి అభిమానుల్లో.. సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మోక్షజ్ఞ తొలి సినిమా కావడంతో ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించేందుకు వశిష్ట ప్రత్యేక కసరత్తులు చేస్తున్నారు. కథా చర్చల దగ్గరి నుంచి ప్రతీ విషయంలోనూ బాలయ్య స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అయితే మోక్షజ్ఞ లాంచ్ పర్ఫెక్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో సినిమాలో బాలకృష్ణ గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వబోతున్నారనే వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ గెస్ట్ రోల్ కేవలం సినిమాకు ఒక పవర్ ప్యాక్డ్ టేకాఫ్ లాగా మాత్రమే ఉంటుందని తెలుస్తోంది. సాధారణంగా స్టార్ హీరో వారసుడి లాంచ్ సినిమాలో కనిపిస్తే ఆ క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. అయితే స్క్రీన్ మీద బాలకృష్ణే ఎక్కువ సేపు కనిపిస్తే? అది డెబ్యూ హీరో అయిన మోక్షజ్ఞకు మైనస్‌గా మారుతుందనే జాగ్రత్తను వశిష్ట ముందుగానే ప్లాన్ చేసినట్లు సమాచారం. సీనియర్ హీరో స్థాయికి తగినట్లుగా సినిమా మొత్తం ఉంటే? కొత్త హీరో ఎలివేషన్ తగ్గే ప్రమాదం ఉందని భావించిన దర్శకుడు బాలయ్య పాత్రను కేవలం ఒక మెరుపులా.. సరిగ్గా ఇంట్రడక్షన్ కీలకమైన టేకాఫ్ సన్నివేశాలకే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారట. ఈ గెస్ట్ రోల్ ద్వారా సినిమాకు కావాల్సినంత హైప్ రావడం ఖాయమని.. అదే సమయంలో మోక్షజ్ఞకు పూర్తి స్థాయి హీరోగా ప్రతిభను ప్రదర్శించడానికి తగినంత స్పేస్ దొరుకుతుందని తెలుస్తోంది. నందమూరి అభిమానుల అంచనాలను నిలబెడుతూనే మోక్షజ్ఞ సోలో హీరోగా టాలెంట్‌ను నిరూపించుకోవడానికి ఈ ప్లానింగ్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారుట.

## స్టన్నింగ్ లుక్ లో దివి హొయలు..

ప్రముఖ బ్యూటీ దివి గురించి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్న ఈమె.. సినిమాల కంటే కూడా బిగ్ బాస్ తెలుగు సీజన్ 4 లో కంటెస్టెంట్గా పాల్గొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. అప్పటినుంచి పలు చిత్రాలలో కీలక పాత్రలు పోషిస్తూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఒలకబోస్తున్న ఈ చిన్నది తాజాగా షేర్ చేసిన మరో ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. స్టన్నింగ్ లుక్ లో ఆమె ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఒకసారి సాంప్రదాయంగా కనిపిస్తూ.. అందర్నీ ఆకట్టుకుంటుంది. మరొకసారి గ్లామర్ వలకబోస్తూ కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తూ ఉంటుంది. ఇలా తాజాగా మరోసారి మరో ఔట్ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది ఈ చిన్నది . చూపు తిప్పుకోలేని అందంతో స్టన్నింగ్ లుక్ లో శరీరానికి అతుక్కుపోయేలా దుస్తులు ధరించి చిల్ అవుతూ పార్టీ వైబ్ ను తెగ ఎంజాయ్ చేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా దివి ధరించిన దుస్తుల విషయానికి వస్తే.. బ్లాక్ కలర్ సింగిల్ సైడ్ షోల్డర్ బాడీ కాన్ డ్రెస్ ధరించిన ఈమె ఒకవైపు బాటమ్ చీలిక లాంటి డ్రెస్ ధరించి తన ఫ్యాషన్ సెన్స్ ను చూపించుకుంది . వన్ షోల్డర్ డిజైన్ ఈమె లుక్ కి అదనపు హుందాతనాన్ని అందించింది. ముఖ్యంగా ఈమె రూపానికి అధునాతనమైన గ్లామర్ ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ ట్రెండీ అవుట్ ఫిట్ సెలబ్రిటీ ఫ్యాషన్ లుక్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ట్రెండీ అవుట్ ఫిట్ ధరించడమే కాకుండా దానికి తగ్గట్టు అసలైన ఆత్మవిశ్వాసాన్ని చూపిస్తూ తిరుగులేని స్టార్ పవర్ ను నిరూపించింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికి అయితే ఈ లేటెస్ట్ బ్లాక్ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA